పేజీలు :12
వెల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 153 బుధవారం 18-3-2026 పేజీలు 12 వెల 5/-

## ఫాంహౌస్ డ్రగ్స్ కేసుపై సిట్



### సుధీర్‌బాబు నేతృత్వంలో 9 మందితో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 17: మీడియాటుడే
డ్రగ్స్ పార్టీ వెనుక మూలాలు వెలికి తీయడానికి ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు దర్యాప్తును మూడు నెలల్లో పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని డీజీపీ ఆదేశించారు. ఈ నేరం జరగడానికి దారి తీసిన పరిస్థితులు, డ్రగ్స్ పార్టీ మూలాలు, ఎవరెవరికి ఇందులో సంబంధాలున్నాయి? డ్రగ్స్ పార్టీకి వచ్చిన వారెవరైనా పోలీసుల రాకను గమనించి పారిపోయారా? పోలీసులను బెదిరించడానికి కాల్పులు జరపాల్సిన అవసరం ఏమిటి? కాల్పులు ఆపవద్దు ఏదైనా నేను చూసుకుంటానని పెద్దగా అరిచిందెవరు? రోహిత్‌రెడ్డికి ఆ పార్టీకి హజరైన ఇతర వ్యాపారులకు ఉన్న సంబంధాలేంటి? అనే అంశాలపై సిట్ అధికారులు ఆరా తీయనున్నారు. డ్రగ్స్ పార్టీని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఏర్పాటు చేసినపుడు ఎవరెవర్ని ఆహ్వానించారు? అనే విషయమై తెల్చుకోవడానికి అక్కడికి వచ్చిన వారి ఫోన్ చాట్‌లను సిట్ బృందం పరిశీలించనుంది. తుపాకీ కాల్పుల ద్వారా పోలీసులను కొద్ది నిమిషాలు నిలువరించిన క్రమంలో కొందరు పెద్దలు అక్కడి నుంచి పారిపోయారని సోషల్‌మీడియాలో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

### రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా

# ఢిల్లీ వెళ్తాం!

## అవసరమైతే తల ఒగ్గి, నిధులు తీసుకొస్తాం..



హైదరాబాద్, మార్చి 17 మీడియాటుడే
రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళ్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. అవసరమైతే తల ఒగ్గి నిధులు తీసుకొస్తామన్నారు. రాష్ట్రానికి నిధులు రాబట్టేందుకు ఢిల్లీ వెళ్లి, ప్రధాని మోదీని ఎన్నిసార్లయినా కలుస్తామని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తమది జాతీయ పార్టీ అని, అధినేతలను కలవడానికి ఢిల్లీ వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఢిల్లీకి చక్కర్లు కొట్టలేదా? తన ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడానికి మోదీ వద్ద మోకరిల్లలేదా? అని నిలదీశారు. అసెంబ్లీకి ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును తీసుకొచ్చి చదువుతున్నారని, కేటీఆర్‌ది ఊకదంపుడు ఉపన్యాసమని ఎద్దేవా చేశారు. 2023 నుంచి వరస ఎన్నికల్లో ఫ్లాప్ అవుతున్న బీఆర్ఎస్ నేతలు.. వరస విజయాలు సాధిస్తున్న కాంగట?గ్రను ఫ్లాప్ అయ్యిందని ఎలా అంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేటీఆర్ పంథా మార్చుకోవాలని శ్రీధర్‌బాబు హితవు పలికారు. మహిళా సాధికారితపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గోబెల్స్ ప్రచారం, సోషల్ మీడియాలో విష ప్రచారం, ప్రకటనలు ఇవ్వడంలో కేటీఆర్‌ను మించినోళ్లు లేరని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందని, అలాంటి మహా నాయకురాలిపై కూడా వ్యంగ్యంగా మాట్లాడడం సరికాదని శ్రీధర్ బాబు అన్నారు. ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీల్లో 30-40 శాతం మాత్రమే గ్రౌండింగ్ అవుతాయనే విషయం ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. అనంతరం శ్రీధర్‌బాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మారే అవకాశం లేదని చెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వెళ్లి ఆయనతో మాట్లాడాలన్నారు. జీవన్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

### రాహుల్‌ది సభాధిక్కారం..

## క్షమాపణ చెప్పాలి



న్యూఢిల్లీ, మార్చి 17: మీడియా టుడే
లోక్‌సభలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ప్రవర్తన సభాధిక్కారం కిందకు వస్తుందని మాజీ సైన్యాధికారులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఆక్షేపించారు. స్పీకర్‌ను ధిక్కరించడం సభామర్యాద, హుందాతనాన్ని ఉల్లంఘించడమే నని స్పష్టంచేశారు. ఆయన తక్షణం క్షమాపణ చెప్పాలని 204 మంది రిటైర్డ్ సైన్యాధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు బహిరంగ లేఖ రాశారు. 'పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శనలను, నిరసనలను నిషేధిస్తూ స్పీకర్ విస్పష్ట ఆదేశాలిచ్చినా.. ఈ నెల 12న పార్లమెంటు ద్వారం మెట్ల వద్ద రాహుల్, ఇతర ఎంపీలు నిరసనకు దిగారు. ఇలా చేయడం దేశ అత్యున్నత పార్లమెంటు సభ్యులకు సముచితం కాదు' అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి వారు సూచించారు.

### పోలీసులు పక్షపాతంగా

# వ్యవహరిస్తున్నారు



- డీజీపీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫిర్యాదు
- ఆరెస్సెస్‌నుపై కాంగ్రెస్ డిమాండ్ విడ్డూరమని వ్యాఖ్య
- కాంగ్రెస్ పార్టీది దేశ వ్యతిరేక వైఖరి : కిషన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 మీడియాటుడే
రాష్ట్రంలో రాజకీయ దాడులు పెచ్చుమీరుతున్నాయని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని డీజీపీ శివధర్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు ఫిర్యాదు చేశారు. తమ పార్టీకి చెందిన పలువురు నేతలతో కలిసి రాంచందర్‌రావు డీజీపీని మంగళవారం స్వయంగా కలిసి ఓ వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా చుండూరులో బీజేపీ నాయకులపై జరిగిన హత్యాయత్నాన్ని ఈ సందర్భంగా డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ దాడిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని, కానీ పోలీసులు నిందితులకు అనుకూలంగా బలహీనమైన సెక్షన్లతో కేసు నమోదు చేశారని తెలిపారు. అలాగే, వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసిన ఘటనలోనూ స్థానిక పోలీసులు బాధితులపైనే కేసులు పెట్టి పక్షపాతంగా వ్యవహరించారని వివరించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయంలో నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడిపై డీఎస్పీ అనాగరికంగా వ్యవహరించిన వైనాన్ని కూడా డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లో పని చేస్తూ ప్రతిపక్ష బీజేపీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డీజీపీని కోరారు. అమెరికాకు చెందిన యూఎ?సీఐఆర్ఎఫ్ సంస్థ నివేదిక విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వేర్వేరుగా ప్రకటించారు. ఆరెస్సెస్‌ను నిషేధించాలన్న కాంగ్రెస్ పార్టీ డిమాండ్ విడ్డూరంగా ఉందని రాంచందర్‌రావు అన్నారు. యూఎస్‌సీఐఆర్ఎఫ్ అనే ఓ పక్షపాత సంస్థ ఇచ్చిన నివేదికను పట్టుకొని కాంగ్రెస్ మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఆ సంస్థ మన దేశ గూఢచారి విభాగమైన 'రా' ని కూడా నిషేధించాలని సిఫారసు చేసిందని, ఆరెస్సెస్‌ను నిషేధించమంటున్న కాంగ్రెస్.. 'రా' ని కూడా రద్దు చేయమంటుందా? అని ప్రశ్నించారు. తెలంగాణ శాసనసభలో వందేమాతరం గీతాలాపన సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేల వాకౌట్‌పై తమ వైఖరి ఏంటో కాంగ్రెస్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇక, యూఎ?సీఐఆర్ఎఫ్ సంస్థ నివేదిక అంశంలో కాంగ్రెస్ వైఖరిని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తప్పుబట్టారు. విదేశీ సంస్థలతో అంటకాగుతూ కాంగ్రెస్ తన దేశ వ్యతిరేక వైఖరిని చాటుకుందని తెలిపారు. రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంటి సంస్థలను లక్ష్యంగా చేసుకోని మాట్లాడటం కాంగ్రెస్ దుర్మార్గానికి పరాకాష్ఠ అన్నారు. యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదికను ఖండిస్తున్నామని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యహరిస్తూ, హిందుత్వాన్ని అవమానించే విధంగా మాట్లాడిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ధర్మాచార్య బాలస్వామి రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు.

### బాధితులందరికీ సంపూర్ణ

## న్యాయం జరగాలి

### రాజకీయేతరులతో కమిటీ : కవిత



హైదరాబాద్, మార్చి 17 మీడియాటుడే
ఖమ్మంలోని వెలుగుమట్ల ఇళ్ల కూల్చి వేతపై నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షు రాలు కవిత వెల్లడించారు. రాజకీయా లతో సంబంధం లేని ప్రతినిధులతో కూడి న ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలికితీస్తుందని స్పష్టం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి చంద్రకు మార్, ఆర్మీ మాజీ మేజర్ మదన్‌మో హన్, వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు, న్యాయ వాదులు ఇతర సంస్థల ప్రతినిధులు కమిటీ సభ్యులుగా ఉన్నారని ఆమె తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్‌లతో కలిసి మీడియా తో మాట్లాడుతూ.. బాధితులందరికీ సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

### మహిళలకు 57వేల కోట్ల

# రుణాలిచ్చారా?



**ఇచ్చినట్లు నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా.. రేవంత్ సంతకం చేసిన 6 గ్యారంటీల ఫైలు ఏమైంది?**


**మహిళలకు రూ.2,500, పింఛన్ రూ.4000 అమలేది?**

**ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు.. అన్నట్టుగా పాలన: కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 17 మీడియాటుడే
మహిళలకు రూ.57వేల కోట్ల రుణాలు ఇచ్చారా? ఎప్పుడిచ్చారు? ఎక్కడిచ్చారు? ఎవరికిచ్చారు? ఆర్డర్ కాపీ చూపిస్తే... తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎ?సఎల్పీ ఉప నేత కేటీఆర్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ. 2,500, రూ.4వేల పింఛన్, ఆడపిల్లలకు స్కూటీ, కల్యాణలక్ష్మిలో తులం బంగారం వంటి పథకాల అమలేమైందని నిలదీశారు. ఆయా పథకాలకు ఈ బడ్జెట్‌లోనైనా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో ప్రమాణస్వీకారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సంతకం పెట్టిన ఆరు గ్యారెంటీల ఫైలు ఏమైంది? అని నిలదీశారు. మాయమైన ఈ ఫైలు ఆచూకీ కోసం సిట్ ఏర్పాటు చేయాలని వ్యంగ్యంగా అన్నారు. సీఎం డిక్లరేషన్లకు విలువలేదని, ప్రభుత్వానికి విశ్వసనీయత లేదని... ఇది జీరో వ్యాల్యూ ప్రభుత్వం, జీరో వాల్యూ సీఎం అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే చర్చలో కేటీఆర్ సుదీర్ఘంగా మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు వంటి పదాలు రాకుండా జాగ్రత్త పడ్డారని, 420 హామీల అమలు ప్రస్తావన ఎక్కడా రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అభయహస్తం కాస్తా భస్మాసుర హస్తంలా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన కూలగొట్టు, ఎగ్గొట్టు, చెడగొట్టు... అన్నట్లుగా సాగుతోందన్నారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ చక్కగా తీర్చిదిద్దితే... రేవంత్‌రెడ్డి లూటీ చేస్తున్నాడని ఆరోపించారు. మహిళా సా?ధికారతపై మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. మిస్ వరల్డ్ పోటీదారులను వేధించి దేశం పరువు తీశారని ఆరోపించారు. అప్పట్లో మహిళా మంత్రి ఇంటికి పోలీసులను ఎందుకు పంపించారో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో పది రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని మంత్రి కోమటిరెడ్డి పేర్కొనగా.. 6.56 లక్షల రేషన్ కార్డులిచ్చినట్లు మంత్రి ఉత్తమ్ ప్రకటించారని, మంత్రులకు కూడా అవగాహన లేకపోతే ఎలా? అని నిలదీశారు. ప్రజల ఆస్తులను జీరో చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమేనని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రాలు విడుదలచేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరిస్తే... ఇప్పుడు ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అని ఏవో ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మా పరిశ్రమలను పక్కనపెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలు, జర్నలిస్టులకు, సినీ పరిశ్రమకు భూములిస్తామని ఎలా ప్రకటన చేస్తారని ప్రశ్నించారు.

## జగ్గారెడ్డిని టీపీసీసీ చీఫ్ చేయాలి

### చిట్‌చాట్‌లో మంత్రి కోమటిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 17 మీడియాటుడే
టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్షించారు. జగ్గారెడ్డి ఎప్పుడూ జనంలో ఉండే మాస్ లీడర్ అని, మరో పీజేఆర్ అని వ్యాఖ్యానించారు. ఎవరు ఆపదలో ఉన్నా వెంటనే ఆదుకునే మనస్తత్వం జగ్గారెడ్డిదని గుర్తు చేశారు. అలాంటి మాస్ లీడర్‌ను టీపీసీసీ చీఫ్‌గా నియమిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు కచ్చితంగా వస్తాయని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన.. ఈ మేరకు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇదే అంశంపై మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సైతం స్పందించారు. పార్టీలో జగ్గారెడ్డి సీనియరేనని, టీపీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమించాలనేది అధిష్ఠానం చేతిలో ఉంటుందని, తన చేతిలో ఉండదని వ్యాఖ్యానించారు.


## నా కలను నెరవేరుస్తారా..

### నయనతారపై తమిళనాడు ఎంపీ అనుచిత వ్యాఖ్యలు..



తమిళనాడు, మార్చి 17 : మీడియా టుడే
ప్రముఖ నటి నయనతారపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు ఎంపీ సీవీ షణ్ముగం వివాదంలో చిక్కుకున్నారు. స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు చేసే క్రమంలో నయనతార ప్రస్తావన తీసుకొచ్చి అనుచిత వ్యాఖ్యలు చేశారు. మహిళల భద్రత కోసం విల్లుపురంలో మంగళవారం ఎన్డీయే కూటమి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అన్నాడీఎంకే రాజ్యసభ్య సభ్యుడు షణ్ముగం, నయనతారను కించపరిచేలా మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. 'మీ కలలను మాకు చెప్పండి. వాటిని నెరవేర్చడానికి మా ప్రభుత్వం కృషి చేస్తుంది' అని ప్రజలకు హామీ ఇచ్చారు. సీఎం హామీకి వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నించిన షణ్ముగం అనవసరంగా నయనతార ప్రస్తావన తీసుకొచ్చారు. 'కలలు కనమని అబ్దుల్ కలాం మనకు చెప్పారు. మన కలలను తనతో పంచుకోవాలని స్టాలిన్ అడుగుతున్నారు. నాకు నయనతార కావాలని అడిగితే.. ఆయన నెరవేరుస్తారా? ఆమెను పెళ్లి చేసుకోవాలనే కల ఎవరికైనా ఉంటే తీరుస్తారా' అని వ్యాఖ్యానించారు. మహిళల భద్రత గురించి ఉద్దేశించిన కార్యక్రమంలో షణ్ముగం ఇలా మాట్లాడడంతో విమర్శలు చెలరేగుతున్నాయి షణ్ముగం కామెంట్లపై డీఎంకే పార్టీ స్పందించింది. 'మా విధానాలను విమర్శించండి. కానీ, మహిళల గురించి అనుచితంగా మాట్లాడకండి. నయనతారను అవమానించడం ద్వారా మహిళలందరినీ మీరు అవమానిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు' అని డీఎంకే పేర్కొంది. కాగా, నయనతారపై ఎంపీ చేసిన వ్యాఖ్యలను నడిగర సంఘం ఖండించింది. సినీ తారలపై అనుచిత వ్యాఖ్యలను తాము ఒప్పుకోమని, బాధ్యతగల పదవుల్లో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని, బేషరతుగా నయనతారకు క్షమాపణ చెప్పాలని నడిగర సంఘం డిమాండ్ చేసింది.

# హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల డిజైన్లు పూర్తి



ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, పనుల డిజైనింగ్ ప్రక్రియ పూర్తయింది.సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ సుందరీకరణ పనులకు సంబంధించి చెరువును ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారు, డిజైనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న ఎ×మీరా ఏజెన్సీ ప్రతినిది యూసుఫ్ మరియు శ్రీనాథ్ తో కలిసి చెరువును పరిశీలించారు.చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి ఉండడం వల్ల నాచారం ప్రాంత ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చెరువులోని నీటిని ఖాళీ చేసి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన ఏజెన్సీ బాధ్యులు చెరువులోని నీటిని తొలగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.గత 30-40 సంవత్సరాలుగా ఈ చెరువును ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారి ప్రత్యేక చొరవతో చెరువు అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బారాసా రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నీలా హేమ్లా నాయక్ సేవలు అభినందనీయ

( మీడియా టుడే గరిడేపల్లి )





ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణి హమీద్ షేక్సూర్యాపేట జిల్లాలోని హుజూర్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ , సర్వారం సింగిల్ విండో డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ సేవలు అభినందనీయమని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ అభివర్ణించారు. యువత ఆయన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ప్రతీ ఏడాది పవిత్ర రంజాన్ మాసంలో పలు ముస్లిం కుటుంబాలకు ఆయన రంజాన్ కిట్లు, నిత్యావసర సరుకులు పంపిణి చేస్తున్నారని అన్నారు. రంజాన్ కిట్ల పంపిణీ కోసం సహకారం అందిస్తున్న దాతలకు, మిత్ర బృందానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.గత ఆరేండ్ల నుంచి ప్రతీ ఏడాది ముస్లిం కుటుంబాలకు చేయూత అందిస్తూ సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్న మిత్ర బృందం తనకు ఉన్నందుకు గర్వంగా ఉన్నదన్నారు. ముస్లిం సోదరసోదరీమణులు ఐక్యతగా మెలగాలని కోరారు. రంజాన్ పండుగను ఇంటిల్లిపాది భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని హమీద్ షేక్ సూచించారు.

# బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్వో కు వినతి పత్రం

## మండల పార్టీ అధ్యక్షులు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్

( మీడియా టుడే గరిడేపల్లి మార్చి 17 )

మంగళవారం బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి సూచనల మేరకు గరిడేపల్లి మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇచ్చిన బిజెపి గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వము ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అలాగే మండల రెవెన్యూ అధికారిగా మీ పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిజెపి గరిడేపల్లి మండల శాఖ తరపున విన్నవించడం జరిగినది, అలాగే వృద్ధాప్య, వితంతు మరియు దివ్యాంగులకు ప్రభుత్వము అందించే ఆసరా పింఛన్లు అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు మండలంలో దరాకస్తులు చేసుకున్న అనేకమంది వృద్ధులు వికలాంగులు మరియు ఒంటరి మహిళలకు ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదు అర్హులైన అభ్యర్థులందరికీ దరాకస్తులను వెంటనే ఆమోదించి వారికి పెన్షన్లు అందించాలని కోరుతున్నాము,పేదలకు ప్రభుత్వము ప్రకటించిన గృహ నిర్మాణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మనవి చేస్తున్నాము, అందువల్ల పై



సమస్యలపై ప్రభుత్వము తక్షణమే స్పందించి మండల పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని మనవి చేస్తున్నాము, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిత్తలూరు సోమయ్య గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు కుక్కడపు లక్ష్మయ్య గౌడ్,నర్సింగ్ నాగ సైదులు గౌడ్, పగిడి రాధాకృష్ణ,గుగులోతు రాజు నాయక్, యమగాని సాయి, మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల అరెస్టు అన్యాయం



( మీడియా టుడే గరిడేపల్లి మార్చి 17 )

ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 18000 వేలు అమలు చేస్తానని చెప్పి రెండు సంవత్సరాలుగా చేయటం లేదు కనీస వేతనం తో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈరోజు చలో సెక్రటేరియట్ కి వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం ఇది అన్యాయమని సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్ అన్నారు ఈ కార్యక్రమంలో గొప్పగాని సత్యమన్న, ఎస్ నర్సిరెడ్డి, ఆర్ వెంకన్న, బొంత వెంకట్ రెడ్డి, నల్లల సైదులు, మౌలానా, బిక్షం,తదితరులు ఉన్నారు

# జగిత్యాల జిల్లాలో కలకలం

## గర్భిణి అని కూడా చూడకుండా భార్యను చంపిన భర్త.

**జగిత్యాల డిస్ట్రిక్ట్ జగిత్యాల ప్రతినిధి మార్చి 17,**

కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో సభ్య సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన భార్యను, కడుపులో పెరుగుతున్న బిడ్డను కూడా చూడకుండా ఓ భర్త కిరాతకంగా చంపేశాడు.స్థానిక సమాచారం ప్రకారం, మాదాపూర్ గ్రామానికి చెందిన దంపతుల మధ్య గత కొంతకాలంగా చిన్నపాటి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం రాత్రి మళ్ళీ గొడవ మొదలైంది. స్వల్ప విషయానికే ఆగ్రహానికి లోనైన భర్త, విచక్షణ కోల్పోయి భార్యపై దాడికి



దిగాడు.నాలుగు నెలల గర్భిణి అని కూడా చూడకుండా భార్యపై తీవ్రంగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. నిండు గర్భిణిని అత్యంత దారుణంగా హతమార్చడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలపై ఆరా తీస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

# ఆర్థిక సాయం అందజేత



**వలిగొండ మార్చి 17 మీడియా టుడే**

మండల కేంద్రంలో ఇటీవల మాతో పాటు చదువుకున్న చిన్ననాటి మిత్రుడు దయ్యాల బాలరాజు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మిత్రులు అందరూ కలిసి 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మిత్రులు ఆలకుంట శ్రీనివాస్,కొంపల్లి విజయ్ కుమార్,పబ్బు స్వామి,ఎక్కలదేవి మల్లేశం, కొండూరు అంజయ్య, మైసోళ్ల మత్స్యగిరి,రేగు వెంకటేష్,ఎమ్మె రమేష్, యార శ్రీశైలం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో

# జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక జీవో తీసుకురావాలి

(TSJA)తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు- కందుకూరి యాదగిరి డిమాండ్



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్రవ్యాప్తంగా మీడియా రంగంలో కొనసాగుతున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక జీవో తీసుకురావాలని అందుకు ప్రభుత్వం వెంటనే కార్యచరణ రూపొందించి ఈ సమావేశాల్లోనే జీవో విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.గత ప్రభుత్వం,ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు హామీలు ఇస్తున్నారు కాలయాపన చేస్తున్నారు ప్రభుత్వాలకు తొత్తుగా ఉన్న పత్రికలలో మీడియాలలో పెద్ద పెద్ద అక్షరాలతో మేము జర్నలిస్టులకు అది చేస్తాం ఇది చేస్తామని రాయించుకు ంటున్నారు ప్రచారాలు చేయించుకుం టున్నారు తప్ప జర్నలిస్టులకు చేసింది ఏమీ లేదు అన్నారు .జర్నలిస్టులను ప్రభుత్వల అవసరాలకు ప్రచారాలకే వాడుకుంటున్నారు.కూరలో కరివేపాకుల తీసి పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలకు అనుకూలంగా నడుస్తున్న వేళ్ళ మీద లెక్కపెట్టగలిగే సంఖ్యలో ఉన్న మీడియానుమాత్రమే అన్ని రకాలుగా ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తూ రాష్ట్రంలో అన్ని మీడియాలలో కొనసాగుతున్న సుమారు 40 వేల మంది జర్నలిస్టులను విస్మరిస్తున్నారని యాదగిరి ఆరోపించారు.ఎన్నికలలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు జర్నలిస్టులకు సొంత ఇంటి కలను సహకారం చేయాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఎటువంటి ఆంక్షలు లేకుండా యాజమాన్యాల ఒత్తిడి లేకుండా నూతనంగా విడుదల చేసిన జీవోను సవరించి అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు.ఎలాంటి వేతనాలు లేకుండా ప్రజలకు ప్రభుత్వానికి ఉచితంగా సేవ చేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యే విధంగా ఎలాంటి ఖర్చులు లేకుండా హెల్త్ కార్డులు చెల్లుబాటు అయ్యే విధంగా చూడాలని యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గత ఐదు సంవత్సరాలుగా తమ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు సంబంధిత శాఖ మంత్రులకు మీడియా అకాడమీ చైర్మన్ లకు జిల్లా కలెక్టర్లకు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు ఇచ్చిన సందర్భాలను యాదగిరి గుర్తు చేశారు.ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక జీవోను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే రూపొందించి విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో కలిసి వచ్చే అన్ని యూనియన్లతో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దుస్స చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుంటి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు యాతాకుల మధుసూదన్, అబ్దుల్ అజీజ్,సందీప్ తదితరులు పాల్గొన్నారు

# ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ జట్టుకు ద్వితీయ స్థానం

**సింగరేణి - బీటీపీఎస్ జట్ల మధ్య ఉత్కంఠభరిత ఫైనల్**

**బహుమతులు అందజేసిన బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న**

**మణుగూరు,మార్చి17(మీడియా టుడే):**



హెవీ వాటర్ ప్లాంట్ మణుగూరులో గత ఐదు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి ఇండస్ట్రి యల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసాయి.ఈ టోర్నమెం ట్‌లో సింగరేణి కొత్తగూడెం, కేటీపీఎస్ ఎ డ ఎ× స్టేజ్, కేటీపీఎస్ ఎ×× స్టేజ్, ఐటీసీ సారపాక, హెచ్‌డబ్ల్యూపీఎం మణుగూరు, టీజీ ట్రాన్స్కో, సింగరేణి మణుగూరు,బీటీపీఎస్ మణుగూరు జట్లు పాల్గొన్నాయి.ఫైనల్ మ్యాచ్‌లో సింగరేణి మణుగూరు మరియు బీటీపీఎస్ మణుగూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోటీలో బీటీపీఎస్ మణుగూరు జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది.బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బి. బిచ్చన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ జట్టు సభ్యులను అభినందించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు పెద్ద సంస్థలు పాల్గొని అద్భుతమైన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన హెవీ వాటర్ ప్లాంట్ యాజమాన్యాన్ని అభినందించారు. సంస్థల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, అవినాభావ బంధం పెంపొందించడానికి ఇటువంటి క్రీడా పోటీలు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ క్రీడలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి కల్తి నరసింహారావు, జట్టు సభ్యులు గోపాలకృష్ణ, అశోక్ రెడ్డి, కార్తీక్, హేమమూర్తి, వినోద్, విశృత్, రమేష్, అనిల్ కుమార్, ప్రేమ్ ప్రకాష్, రవికుమార్, తిరుపతి, ప్రవీణ్, సంపత్, భరత్, నవీన్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

65 సిఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులు అందజేత

పేదలకు వైద్య సహాయం అందించడమే లక్ష్యం




**అశ్వారావుపేట నియోజకవర్గం ప్రతినిధి మధు మార్చి17(మీడియా టుడే)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఆయన నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన మొత్తం 65 దరఖాస్తులను ఎమ్మెల్యే స్వయంగా సేకరించి అధికారులకు సమర్పించారు. తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతూ ఖరీదైన వైద్య చికిత్స అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వైద్య ఖర్చులు అధికంగా ఉండటంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా సహాయం అందేలా కృషి చేస్తున్నామని, బాధితుల సమస్యలను తెలుసుకుని వారికి తక్షణ సహాయం అందేలా అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: మార్చ్ 17**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆశావర్కర్ల సమస్యలను తప్పకుండా పరిశీలించి వారికి పరిష్కారం అందిస్తామని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకొని జిల్లా స్థాయిలో పరిష్కరించే సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని అన్నారు. జిల్లాలో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవతో పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తో మీ సమస్యలను చర్చించి నియమ నిబంధనల అనుగుణంగా పరిష్కరిస్తామని తెలిపారు. మీరు ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని తను తప్పకుండా మీ సమస్యలను పరిష్కరిస్తానని అదనపు కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆశావర్కర్లు సంతోషం వ్యక్తం చేసి తమ సమస్యల, డిమాండ్ లను తెలియజేస్తూ దరఖాస్తును అదనపు కలెక్టర్ కు అందజేసారు.

# సహజ వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

పర్ణశాల రైతు వేదికలో సహజ వ్యవసాయంపై ఓరియంటేషన్ శిక్షణ.

ఖర్చు తగ్గించి నేల ఆరోగ్యం కాపాడే విధానమే సహజ వ్యవసాయం



**భద్రాచలం,మార్చి 17 (మీడియా టుడే):**

రైతులు సహజ వ్యవసాయం వైపు ముందుకు వచ్చి స్థిరమైన వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు పిలుపునిచ్చారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాల రైతు వేదికలో మంగళవారం సహజ వ్యవసాయం పై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు సహజ వ్యవసాయం పద్ధతులు, దాని ప్రయోజనాలు, వ్యవసాయ ఖర్చు తగ్గింపు, నేల ఆరోగ్యం పరిరక్షణ, రసాయనాల వినియోగం తగ్గించడం వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు.అలాగే సహజ వ్యవసాయం ద్వారా పంట దిగుబడులు మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో స్థానిక వనరులను వినియోగించి తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయవచ్చని చెప్పారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు సహజ వ్యవసాయానికి అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను అమలు చేసి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తికి తోడ్పడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది,పలువురు రైతులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుడు కల్కూరియాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి సిఐటియు



**వలిగొండ మార్చి 17 మీడియా టుడే**

మండల పరిధిలోని కెర్చి పెల్లి గ్రామ పంచాయితీ వాటర్ మెన్ కల్కూరి యాదయ్య కుటుంబాన్ని కి 5 లక్షల ఎక్స్ గ్రేసియా ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కేర్చి పల్లి లో వాటర్ మెన్ కల్కూరి యాదయ్య మృతదేహంపై పూలమాల వేసిశ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ కే ర్చుపల్లి గ్రామంలో వాటర్ మెన్ గా కలుకూరి యాదయ్య గత 31 సంవత్సరాల నుండి పనిచేసిఊరి కి సేవలు అందించారు. మల్టీపర్పస్ విధానం వచ్చిన తర్వాత వి ర్లగడ్డలో రోడ్లన్నీ శుభ్రం చేస్తూ మోరీలు క్లీన్ చేస్తూ వాటర్ మెన్ గా గూడానికి సేవలు చేశారని వారి మరణం గ్రామపంచాయతీ కి తీరని లోటుఅని ఆవేదన వ్యక్తం చేశారు. యాదయ్య వృద్ధాప్యం వచ్చినప్పటికీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పైచేసే ఉద్యమాలులో చురుకుగా పాల్గొనే వారని అన్నారు. అకస్మాత్తుగా మరణించినటువంటి యాదయ్య కుటుంబానికి ప్రభుత్వం 5 లక్షల ఎక్స్ గ్రేసీయ్ చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ఉపసర్పంచ్ మల్లేశం,రైతు సంఘం నాయ కులు కందటి సత్తిరెడ్డి,గ్రామస్తులు సత్తిరెడ్డి నరసింహ,గ్రామ పంచాయతీ కార్మికులు స్వామి యాదయ్య,యాదమ్మ, గ్రామస్తులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి విద్యుత్ కోతలను అరికట్టాలి

-నూతన పెన్షన్లు మంజూరి చేయాలి.సిపిఎం

**వలిగొండ మార్చి 17 మీడియా టుడే**



విద్యుత్ కోతల వల్ల రైతుల మోటార్లు ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని విద్యుత్ కోతలను అరికట్టి నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి. మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులులు డిమాండ్ చేశారు మంగళవారం గోపరాజుపల్లి గ్రామంలో ఇంటింటి సిపిఎం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కోతల వల్ల రైతుల ట్రాన్స్ఫార్మర్లు మరియు మోటార్లు కాలిపోతున్నాయని దీంతో రైతాంగం అంతా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విద్యుత్ కోతలను అరికట్టి నిరంతరాయంగా సరఫరాను అందించాలని డిమాండ్ చేశారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పెన్షన్లను పెంచడంతోపాటు అర్హులందరికీ పెన్షన్లు అందిస్తామని చెప్పిన మాటలు అమలకు నోచుకోలేదని అన్నారు అనేకమంది వృద్దులు,వికలాంగులు, వితంతువులు రెండున్నర సంవత్సరాలుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం నూతన పెన్షన్ల మంజూరులో వైఫల్యం చెందిందని విమర్శించారు వృద్ధులకు, వితంతువులకు 4 వేల రూపాయలు, వికలాంగులకు 6 వేలు రూపాయలు పెంచి ఇస్తామని చెప్పిన హామీ నీటి మీద మూటలాగా తయారైందన్నారు వెంటనే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు గోపరాజుపల్లి పాల సెంటర్ నుండి మూసికి వెళ్లి రోడ్డు మంజూరు అయిందని చెప్పిన మాటలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు వెంటనే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని,వేములకొండ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు అదేవిధంగా గోపరాజుపల్లి నుండి దుప్పెల్లి వరకు అసంపూర్తిగా ఆగిపోయిన బీటీ రోడ్లు వెంటనే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఏనుగుల నరసింహ,సహాయ కార్యదర్శి సలిగంజి రాజయ్య,నాయకులు గాజుల మల్లయ్య,రుద్రపల్లి లింగయ్య,సలిగంజి నరసింహ,రుద్రపల్లి రామలింగం, సలిగంజి నవీన్,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

# ఉగాది కానుకగా సింగరేణి కార్మికులకు క్యాలెండర్ల పంపిణీ

సీఎండీ నిర్ణయాన్ని అభినందించిన టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు



**మణుగూరు,మార్చి17(మీడియా టుడే):**

ఉగాది పండుగ సందర్భంగా సింగరేణి సంస్థ కార్మికులకు 2026 సంవత్సరపు సింగరేణి క్యాలెండర్లను పంపిణీ చేయడం పట్ల మణుగూరు ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని తెలిపారు.సంస్థపై అపారమైన అనుభవం,పట్టుదల కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారి డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టడం సంస్థకు గౌరవకరమైన విషయమని అన్నారు.సంస్థ అభివృద్ధి కోసం రేయింబవళ్లు కష్టపడుతున్న కార్మికులను మరింత ప్రోత్సహించేందుకు ఉగాది పండుగ సందర్భంగా సింగరేణి క్యాలెండర్లను అందించడం మంచి నిర్ణయమని చెప్పారు. ఈ చర్య ద్వారా కార్మికుల్లో ఉత్సాహం పెరిగి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మణుగూరు టిబిజికెఎస్ తరఫున సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి కి నాగెల్లి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.అలాగే ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఏరియా అధికార ప్రతినిధి రమేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఐటిడిఏలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



**భద్రాచలం,మార్చి 17(మీడియా టుడే):**

ఐటిడిఏ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కాలనీల ప్రజలకు సౌకర్యవంతమైన విద్యుత్ సరఫరా అందించేందుకు 33/11 కెవీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ తెలిపారు.మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక ఉన్న సుమారు 30 కుంటల ఖాళీ స్థలంలో 33/11 కెవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలోని శివారు కాలనీల్లో లోవోల్టేజ్ సమస్యలు, విద్యుత్ లోపం కారణంగా ఎలక్ట్రానిక్ పరికరాలు పాడవుతున్నాయని ప్రజలు చేసిన విజ్ఞప్తుల మేరకు విద్యుత్ శాఖ ద్వారా రూ.3 కోట్ల వ్యయంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం ఐదు నెలల్లో పూర్తవుతుందని, దీని ద్వారా పట్టణంతో పాటు శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలు పూర్తిగా తగ్గి సుమారు 5 వేల కుటుంబాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈ. మహేందర్, భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ కే. జీవన్ కుమార్, భద్రాచలం కన్స్ట్రక్షన్ డీఈ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తలకు తగిలే గాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ శ్రీనివాస్ బోట్ల

**శంషాబాద్ మార్చ్ 17 (మిడియా టుడే ప్రతినిది ):**




తలకు తగిలే గాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శ్రీనివాస్ బోట్లో తెలిపారు. మలక్పేట్ యశోద ఆసుపత్రి బృందం శంషాబాద్ జోన్ కేంద్రంలోని ఎలైట్ హోటల్లో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన సమావేశంలో తలకు తగిలే గాయాలు తో ఎలా ప్రమాదంగా ఉండాలి మెదడుకు సంబంధించిన గాయాలు ఎలాంటి సెమి టమ్స్ఉంటాయి. అనే అంశాల కోసం వివరించారు డాక్టర్ శ్రీనివాస్ బోట్లో మాట్లాడుతూ శంషాబాద్ ప్రాంతంలో నివాసం నుండి ఓ విద్యార్థి నగరంలో చదువుతున్న తన స్కూల్లో మెట్లు దిగుతూ జారి కింద పడిపోయి తలకు గాయాలయ్యాయని ఆ గాయాలు సరిగా కనిపించక వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తే మెదడుకు సంబంధించిన గాయాలు కావొచ్చునని అనుమానం కలిగితే వెంటనే మలక్పేటలోని యశోద ఆసుపత్రికి తీసుకువచ్చారని ఆసుపత్రిలో అన్ని పరీక్షలు చేస్తే మెదడుకు లోపల గాయాలైనట్లు తెలిసిందని ప్రామాటిక్ గురయ్యాడని తెలిసిందన్నారు. దీంతో ఇప్పుడు చదివిన తర్వాత న్యూరో న్యూరో సర్జికల్ ఆపరేషన్ , ఆధునిక న్యూరో క్రిటికల్ కేర్ సర్జరీలు చేసి వైద్యులు రక్షించగలిగారని వారు చెప్పుకు వచ్చారు పెద్ద ఎపి జూరల్ మరియు తల ఎముక ఇరుగుడు కారణంగా కొన్ని సందర్భాల్లో మెదడు నలిగి పోవడం వల్ల స్థితికి దారి తీసే అవకాశాలు ఉంటాయని ఇలాంటి పరిస్థితుల్లో నివారించే ందుకు నివారించేందుకు న్యూరో క్రిటికల్ కేర్ అవసరమవుతుందని చెప్పారు. వైద్యులు చేసిన సమగ్ర పరీక్షలో టెంపర్ పరీక్ష ద్వారా పెద్ద ఏపీ డ్యూరల్ హేమరేజ్ మెదడు మధ్య రేఖ తారుమారైనట్లు వైద్యులు గుర్తించినట్లు చెప్పారు. పరిస్థితి ప్రాణాపాయానికి దారి తీసే అవకాశం ఉండడంతో న్యూరో సర్జరీ బృందం క్రానియోటమి చేసి రక్తం గడ్డను విజయవంతంగా తొలగించి బాలుడి ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని చెప్పారు. బాలుడు దాదాపు స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నాడు. పరీక్షల్లో ఎడమ వారియేటల్ ప్రాంతంలో వాపు కనిపించడంతో ఆర్బిటల్ హిమటోమ ఉన్నట్లు గుర్తించామన్నారు. కంటి పైన ఉన్న పాప పడిపోవడం మరియు పరిమితంగా ఉన్నట్లు గుర్తించారు. ఏది ఏమైనా ఏదైనా ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు ఇతర ముఖ్య ప్రాంతాల్లో గాయాలయితే వెంటనే సమీప ప్రాంతంలోని ఆసుపత్రులకు తరలించాలని అవసరమైతే పెద్ద ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించి అవసరమైన వైద్యం చేయించకపోతే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని ప్రజలు అవగాహన చేసుకుని అప్రమత్తంగా ఉండాలని యశోద ఆసుపత్రి బృందం ప్రజలను కోరింది

# హామీలు నెరవేర్చకుండా బూటక పాలన చేస్తున్న కాంగ్రెస్ : బిజెపి

## ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న బూటకపు కాంగ్రెస్



**మీడియా టుడే మధిర:**
వల్లమాలిన హామీలతో గద్దెనెక్కి వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మధిర పట్టణ శాఖ భారతీయ జనతా పార్టీ మండిపడ్డది. మధిర పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మధిర తాసిల్దార్ కార్యాలయంలో వినతులతో కూడిన వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కిందని మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ సూచనలతో తాసిల్దార్ కార్యాలయంలో మెమోరడం ఇవ్వటం జరిగిందన్నారు. హామీలు అమలులో నిర్లక్ష్య వైఖరికి నిరసిస్తూ వృద్యాపై వితంతు పెన్షన్లు 4000 రూపాయలకు పెంచాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందే విధంగా చూడాలని, ఉచిత కరంటు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ ఎకౌంట్లో వెంటనే వేయాలని, ఆడపిల్లలకు పెళ్లి కానుక తులం బంగారం హామీ అమలు చేయాలని, మహిళలకు 2500, నిరుద్యోగులకు 2000 రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధిర అసెంబ్లీ అభ్యర్థి పెనుమళ్ళపల్లి విజయరాజు, జిల్లా కార్యదర్శి రామిశెట్టి నాగేశ్వరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండా చంద్రశేఖర్ రెడ్డి,బాపట్ల రమేష్, జిల్లా నాయకులు చిలువేరు సాంబశివరావు, చక్రవర్తులు వరదరాజన్, బొడ్డు రమేష్, దోర్నాల రవీంద్ర,భాను ప్రసాద్, దోర్నాల దినకర్, ఆదం, పి కిషన్ రాజు, గోళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు

# గుండాల మండలంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

## రెండు రోజుల్లో లోపాలు సరిచేయాలని ఏకలవ్య పాఠశాల ఏజెన్సీకి హెచ్చరిక

### విద్య, వైద్యం, పశుసంవర్ధక శాఖల సేవలపై సమీక్ష - ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అధికారులకు ఆదేశాలు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి17(మీడియా టుడే):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,గుండాల మండలంలో ప్రభుత్వ సేవల నాణ్యతను సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్య, వైద్యం, పశుసంవర్ధక ,పరిపాలన శాఖలకు సంబంధించిన పలు సంస్థలను సందర్శించి సేవలపై సమీక్ష చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ తరగతి గదులు, ఆర్ఓ ప్లాంట్, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, పాలు సరఫరా, పరీక్షల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో పరిశుభ్రత లోపాలు, కిచెన్ షెడ్‌లో అస్వచ్ఛత, సిబ్బంది కొరత, కంప్యూటర్ ల్యాబ్‌లో దుమ్ము పేరుకుపోవడం, మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడం వంటి విషయాలను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో అన్ని లోపాలను సరిచేయాలని, లేనిపక్షంలో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ గుర్తింపును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. ప్రతి భోజనం తాజాగా వండి నాణ్యతతో అందించాలని సూచించారు.అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మందుల గది, స్టోర్ రూమ్, పరీక్షల గది, రికార్డులను పరిశీలించారు. డెంగ్యూ పరీక్ష కిట్లు, మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మందుల పంపిణీ గదిలో సిబ్బంది లేకపోవడంపై వివరణ కోరారు. మందుల నిల్వ గదిలో ఎయిర్ కండిషనింగ్ సదుపాయం కల్పించి ఫార్మసిస్ట్‌ను నియమించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వడదెబ్బకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు.గుండాల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. రెండు సంవత్సరాలుగా పనిచేయని ఆర్ఓ ప్లాంట్‌ను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ మందుల నిల్వలు, రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో పశువులు జీవనాధారంగా ఉన్నందున పశువులకు సమయానికి వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. టీకాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ ఖాసీమ్, మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపీడీవో బాలరాజు, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ నితిన్ సింగ్, డాక్టర్ సుధీర్, కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణ సంధ్య,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ కాగితాలకే పరిమితమా

## పేదలకు న్యాయం అందని ద్రాక్షేనా

“ప్రజల కోసం – ప్రజలతో కలిసి” అని చెప్పుకునే ప్రభుత్వం “ఫ్రెండ్లీ పోలీసింగ్” అంటూ గొప్పగా ప్రకటించే పోలీస్ శాఖ.ఆ హామీలు నిజంగా పేదల జీవితాల్లోకి దిగుతున్నాయా? లేక ప్రకటనలకే పరిమితమైపోతున్నాయా? అనే ప్రశ్నలు నేడు సామాన్య ప్రజల మనసుల్లో మళ్ళీ మోగుతున్నాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామం రెవెన్యూ పరిధిలో జరిగిన ఒక ఘటన… ఈ వ్యవస్థల పనితీరుపై తీవ్ర అనుమానాలు కలిగిస్తోంది.చిత్తలూరు గ్రామానికి చెందిన మోదుగు సరిత (భర్త: జగన్మోహన్ రెడ్డి) భూమి పంచాయతీ వివాదం ప్రస్తుతం తీవ్ర విషాదానికి దారితీసింది. ఈ భూమి వివాదం నేపథ్యంలో ఆమె మరిది ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. ఒక కుటుంబం దుఃఖంలో మునిగిపోయిన ఈ పరిస్థితిలో… బాధితులకు అండగా నిలవాల్సిన వ్యవస్థలు వారికి న్యాయం చేయడంలో విఫలమవుతున్నాయన్న భావన కలుగుతోంది.

**మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే...**
మానసిక అస్వస్థతతో బాధపడుతున్న ఆమె అత్తగారు మోదుగు పూలమ్మ పేరున ఉన్న భూమిని కాజేయాలని ఆమె పేరును ఉపయోగిస్తూ… కొందరు భూ ఆక్రమణ దారులు దొంగ పత్రాలు సృష్టించి… అరవై ఐదు లక్షల రూపాయలకు ఆమె వద్ద భూమి కొనుగోలు చేశామని, ఆమే సంతకాలు ఫోర్జరీ చేసి..ముందుగా ముప్పై లక్షలు, తరువాత మరో ముప్పై ఐదు లక్షలు చెల్లించామని తప్పుడు డ్యాక్యుమెంట్లు సృష్టించి భూమి ఆక్రమణ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో బాధితురాలు సరితకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ తటస్థంగా వ్యవహరించకుండా… భూ ఆక్రమణ దారుల పక్షాన నిలుస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే… కొన్ని ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వేదికలు కూడా వాస్తవాలను పక్కనబెట్టి ఒకవైపు కథనాలు ప్రచారం చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఇది ఒక వ్యక్తి సమస్య మాత్రమే కాదు.ఇది వ్యవస్థలపై ప్రజల నమ్మకానికి సంబంధించిన ప్రశ్న.ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వం.“ఫ్రెండ్లీ పోలీసింగ్” అని ప్రకటించే పోలీస్ శాఖబాధితుల పక్షాన నిలుస్తాయా? లేక భూ ఆక్రమణ దారుల పక్షాన నిలుస్తాయాఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు అధికార వ్యవస్థలపై ఉంది.అందువల్ల తెలంగాణ రాష్ట్ర డీజీపీ గారు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని వెంటనే కలుగజేసుకునిఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని,దొంగ పత్రాలు సృష్టించిన భూ ఆక్రమణ దారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలనిప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి తరఫున వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను.పేదలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా.నిజ జీవితంలో కూడా న్యాయం నిలవాలి.అదే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం. ప్రజా హక్కుల పరిరక్షణ కోసంవిజ్ఞప్తి

# వేల్పుగొండ పరిధి బొల్లికుంట తండాలో పులి కలకలం



**టేక్మాల్: మార్చ్ 17 (మీడియా టుడే)**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామ పరిసరాల్లో పులి సంచరిస్తుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నిన్న రాత్రి బొల్లికుంట తాండా సమీపంలో పులి సంచరించినట్లు తండావాసులు గుర్తించారు. పులి గ్రామానికి అతి సమీపంలోకి రావడంతో ప్రజలు తీవ్ర భయాందో ళనలకు గురవుతున్నారుబొల్లికుంట తండాకు చెందిన పూల్యానా యక్ సోమవారం రాత్రి తన పొలం వద్దకు వెళ్లే క్రమంలో దారిలో నిద్రిస్తున్న పులిని చూసినట్లు స్థానికులకు చెప్పాడు. దీంతో భయాందోళన చెందిన వారు వెంటనే స్థానిక సర్పంచ్ కు సమాచారాన్ని అందజేశారు. పులి సంచారం నేపథ్యంలో గ్రామ సర్పంచ్ అధికారులను అప్రమత్తం చేశారు. వేల్పుగొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో దండోరా వేయించారు. ఫారెస్టు అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.పశువుల కాపరులకు సూచన: పశువులను అటవీ ప్రాంతం వైపు తోలుకెళ్లవద్దని, ఒంటరిగా అడవిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు.జాగ్రత్తలు: రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్లరాదని, ఇంటి పరిసరాల్లో వెలుతురు ఉండేలా చూసుకోవాలని గ్రామస్థులకు సూచించారు

# వేములవాడలో ప్రముఖ పుణ్య క్షేత్రంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్. మీడియా టుడే మార్చి 17:**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించు కున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, వేద పండితులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి





**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి17:**
రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత సాధారణ ఎన్నికల్లో గెలవడం కోసం 420 హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చినాక హామీలను విస్మరించింది అని, అందులో ప్రధాన హామీలు రైతు భరోసా,మహిళకు నెలకు 2500/-, సబ్సిడీ గ్యాస్,ఆసరా ఫెన్షన్ ల పెంపు,ఉచిత గృహ వినియోగ విద్యుత్ వంటి అంశాలతో పాటు ప్రదానంగా నిరుద్యోగులకు నెలకు 1000/- ఫెన్షన్, ఉద్యోగాల భర్తీ వెంటనే అమలు చేయాలని,ప్రభుత్వం అలసత్వంవీడి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాబోయే రోజుల లో బీజేపీ పార్టీ పెద్ద ఎత్తున ప్రభుత్వం పై ప్రజాపోరాటం చేస్తుందని నేరేడుచర్ల పట్టణ,మండల కమిటీలు ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది.ఇట్టి హామీలు వెంటనే అమలు చేయాలని మండల కమిటి,పట్టణ కమిటి అధ్యక్షులు కొణతం.నాగిరెడ్డి,చింతకుంట్ల.రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ మరియు మున్సిపల్ కమీషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో పట్టణ ప్రధాన కార్యదర్శులు ఏమిరెడ్డి శంకర్ రెడ్డి,కాలం.నాగయ్య,పల్లెపంగ.వీరబాబు,జిల్లా కోశాధికారి తాళ్ల. నరేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి,ఇతర జిల్లా,మండల,పట్టణ నాయకులు ఉరిమల్ల రామూర్తి,ఆకుల జగతయ్య,కొప్పు లక్ష్మి నారాయణ,కొప్పుల రాంరెడ్డి,నందిపాటి హిందూజా, కాంపెల్లి. నారాయణరెడ్డి,దేవిరెడ్డి.నాగిరెడ్డి,అంజయ్య,కాల్వ. సైదులు,వినయ్ తదితరులు పాల్గొనటం జరిగినది.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

### తెలంగాణ సాహితి కన్వీనర్ పారుపల్లి ఝాన్సీ



**నేలకొండపల్లి మార్చి 17 మీడియా టుడే**
సమాజంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలని తెలంగాణ సాహితీ కన్వీనర్ పారుపల్లి ఝాన్సీ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పారుపల్లి ఝాన్సీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే సమాజం బాగుపడుతుందని అన్నారు. మహిళ ఒక వ్యక్తి కాదని సమాజాన్ని ముందుకు నడిపించే మహాశక్తి అని మహిళలేని ప్రపంచమే శూన్యమన్నారు. నేటి ఆధునిక సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు కూడా అన్ని రంగాలలో రాణించడం అభినందనీయమన్నారు. మహిళలు వారు పనిచేస్తున్న ప్రదేశాలలో ఇంకా అనేక అవమానాలు వివక్షతలకు గురికావడం బాధాకరమన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమర్థ విధానాల వల్ల మహిళలపై ఇంకా దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మహిళల పట్ల గౌరవభావం పెరిగేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పారిశుద్ధ మహిళ కార్మికులను, హాజరైన మహిళామూర్తులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్త రామదాస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతయ్య, క్యాంప్ చైర్మన్ మచ్చ రేణుక, క్యాంపు వైస్ చైర్మన్ పాల్వాయి శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారిణి ఎం రాధ, ఏపీవో ఆర్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, సేంద్రియ వ్యవసాయ ప్రచారకురాలు వసుంధర, గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ మద్దినేని మహేష్, భక్త రామదాసు సర్వీసె సొసైటీ సెక్రటరీ గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, మాజీ అధ్యక్షులు గెల్లా జగన్మోహన్రావు, ఎల్లంపల్లి శ్రీనివాసరావు, వల్లంచెట్ల భాస్కరరావు, ఎలమద్ది లెనిన్, ఏటుకూరి వెంకటరామారావు, పాలడుగు పూర్ణచంద్రరావు, మచ్చ రఘుపతి, చెట్ల భాస్కర్ రెడ్డి, సర్వీస్ సొసైటీ సభ్యులు కొఠారి వెంకటాచారి, నంచర్ల దేవిప్రసాద్, ఎర్ర సైదయ్య, భవనాసి దుర్గారావు, దేవరశెట్టి లక్ష్మణరావు, షేక్ ఖాసింసాహెబ్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కందికట్కూర్‌లో మద్యం అమ్మకం నిషేధం



రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 17 :

ఇల్లంతకుంట మండలం కందిక ట్కూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ విజయమ్మ అధ్యక్షతన పాలక మండలి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇట్టి గ్రామ సభలో పాలక మండలి గ్రామ ప్రజలు కలిసి గ్రామ అభివృద్ధి కొరకు పలు అంశాలపై చర్చించి గ్రామంలో మద్యం షాపులు బందుచేయాలని. అలాగే గుట్కా కి సంబంధించిన వాటిని కూడా అమ్మరాదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయమ్మ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు రావు, ఉప సర్పంచ్ అజయ్ , వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## బిసి హాస్టల్ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలి

**-గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్**



శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ మార్చ్ 17:

బిసి బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్, శేరిలింగంపల్లి మండల తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రంగారెడ్డి జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి డిప్యూటీ డైరెక్టర్ కేశురాంలతో పాటు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లకు వినతి పత్రాలు అందజేశారు. వసతి గృహం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న ప్రహరి నిర్మాణం చేపట్టడం లేదని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహానికి రక్షణ లేకపోవడంతో ప్రాంగణం కబ్జాలకు గురవుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాలుర వసతి గృహం స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ బస్తీల వాసులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభదాయకం

**- వ్యవసాయ సహాయ అధికారి తాతారావు**

**సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు**



మణుగూరు,మార్చి 17(మీడియా టుడే):

పినపాక మండలం జానంపేట గ్రామంలో రైతులకు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం కొనసాగించేలా ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సహాయ అధికారి తాతారావు ముఖ్య అతిథిగా హాజరై సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని, సేంద్రియ పద్ధతులు రైతులకు దీర్ఘకాలంలో లాభదాయకమని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు, ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని ఆయన వివరించారు. రైతులు సహజ వనరులను వినియోగిస్తూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఈ సందర్భంగా ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం చేపడుతున్న రైతులను అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా ప్రోత్సహించారు. గ్రామంలోని మరిన్ని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈవోలు, స్థానిక సర్పంచ్ ఉమా మహేశ్వరి, మల్లారం సర్పంచ్ ఇర్పా సాంబశివరావు, అమరారం సర్పంచ్ ప్రసాద్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

**- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి బి.పుష్పలత**




రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే: మార్చి 17

రాజీ మార్గమే రాజ మార్గమని, కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు . బి.పుష్పలత అన్నారు మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో రాజన్న సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ జిల్లా జడ్జి మాట్లాడుతూ కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమవడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులను పరిష్కారానికి పంపేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల/ఇన్చార్జి కార్యదర్శి, డీ ఎల్ ఎస్ ఎ, పి.లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు .జూపల్లి శ్రీనివాసరావు తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు

## బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలు

టేక్మాల్ మార్చ్ 17:-(మీడియా టుడే)

బఫర్ జోన్లో నిర్మాణాలను పట్టించుకోవడం లేదని మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరదిలోని కాదులూరు గ్రామానికి చెందిన రైతులు శిలపల్లి కిష్టయ్య, తలారి శంకరయ్య, గంధం బతుకమ్మలు సోమవారం తహసీల్దార్ కార్యలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో జెయింట్ సర్వే నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ.. గ్రామ శివారులో ఉన్న, మాలకుంట శిఖం విస్తీర్ణాన్ని కబ్జా చేసి అలాగే మాలకుంట అలుగును ఆనుకొని హైదరాబాద్ కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి యదేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో, మాలకుంట ఆయకట్టు కింద ఉన్న, వ్యవసాయ పొలాలకు దారి లేకుండా పోయిందని రైతులు అన్నారు. కావున పోలాలకు వెళ్లే దారి కోసం, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశామని రైతులు అన్నారు. ఫిర్యాదు అందుకున్న , నీటిపారుదల టేక్మాల్ ఏఈ, సుప్రియ, సాయి తేజ, సర్వేయర్ నాగరాణి, జాయింట్ సర్వే



నిర్వహించారు. మాలకుంట అలుగుతో పాటు, కుంట శిఖం పరిశీలించి, ఆలుగు ప్రాంతంలో సర్వే చేపట్టారు. మ్యాప్ ఆధారంగా, త్వరలో స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో పూర్తి వివరాలు వేల్లాడిస్తామని అధికారులు తెలిపారు.

## టేక్మాల్ రామలింగేశ్వర ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

**దాతల సహకారంతో అభివృద్ధి పనులు ముమ్మరం**



టేక్మాల్: మార్చ్ 17 (మీడియా టుడే)

టేక్మాల్ మండల కేంద్రం లోనిశ్రీ రామ లింగేశ్వర స్వామి చరిత్ర రామాయణ కాలంతో ముడిపడి ఉంది, రావణ వధ తర్వాత రాముడు బ్రహ్మహత్యా పాతకం నుండి విముక్తి పొందడానికి శివుడిని పూజించిన క్షేత్రాలుగా ప్రసిద్ధి పొందాయి. అ నేపథ్యం లోనే మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో రామలిం గేశ్వర ఆలయం వెలిసిందని పురాణాలు చెబుతున్నాయి. అందులో ప్రతిష్టించిన విగ్రహాలను కొందరు దుండగులు భిన్నం చేయగా తిరిగి శ్రీ మదానంద స్వామి కాశి పుణ్యక్షేత్రం నుండి శివ లింగం విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్టించారు. ఆలయాన్ని ఎవరు పట్టించుకోక పోవడంతో ఆదరణకు నోచుకోలేదు. టేక్మాల్ గ్రామ శివారులో ఉన్న గుట్టపై ఆహ్లాద వాతావరణం పక్షుల కిలకిల రావాల మధ్య ఉండే ప్రశాంతత వాతావరణంలో రామలింగేశ్వర స్వామి ఆలయం నెలకొంది. ఆలయాన్ని అభివృద్ధి పరచాలన్న సంకల్పంతో దాతలు ముందుకొచ్చి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. శివాలయశీలో నిత్యం ధూప ధూప నైవేద్యాలు అందించాలన్న సదుద్దేశంతో ముందుకు రావడం ఆనందదాయకం అంటూ భక్తులు వారి అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. ఇక్కడ శివుడు రామ లింగేశ్వరుడిగా కొలువై భక్తుల కోర్కెలు తీరుస్తున్నాడు. రామాయణ నేపథ్యంలో లంకా దహనం తర్వాత రావణ బ్రహ్మను చంపిన పాపం పోగొట్టు కోవడానికి, రాముడు శివలింగాన్ని ప్రతిష్టించి, పూజించాడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు శివభక్తికి, పాప విముక్తికి ప్రతీకలు. రాముడు ప్రతిష్టించిన శివలింగా కి చాలా ప్రాముఖ్యత ఉంది.

**ఉగాది పండగ రోజు**


టేక్మాల్ శివారులోని రామలింగేశ్వర గుట్టపై ఈ ఆలయంలో రామలింగేశ్వర స్వామిగా శివుడు, పార్వతీ దేవి కొలువై ఉన్నారు. ప్రతి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు గ్రామాల నుంచి పురవీధుల గుండా జాతర బండ్లను అలంకరించి ఊరేగింపుగా డప్పు చప్పులతో ఆటపాటలతో ఆలయం ముందున్న మర్రి చెట్టు వరకు వచ్చి చుట్టూ ప్రదర్శనలు చేస్తారు. కోరిన కోరికలు నెరవేర్చు స్వామి అంటూ వేడుకుంటారు. చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించి రామలింగేశ్వర స్వామి కృపకు పాత్రులు కావాలని అభివృద్ధి కమిటీ పిలుపునిస్తోంది. జీవనయానంలో మానసిక ప్రశాంతత కోల్పోయిన వారు, వ్యసనాలతో బాధపడేవారు అనారోగ్య సమస్యలతో సుతమతమవుతున్న వారు సైతం స్వచ్ఛమైన గాలి దొరికె ఆధ్యాత్మిక క్షేత్రం లోని సేవకు చెరువు కావాలన్నారు. ఎక్కడ దొరకని ప్రశాంతత ఆధ్యాత్మిక ఆలయాల్లో లభిస్తుందని వేద పండితులు చెబుతున్నారు. మానసిక ప్రశాంతత ఆలయాలుగా అభివృద్ధి చెందితే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు తమ తమ సమయాన్ని కేటాయించి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కమిటీ పిలుపునిస్తోంది.

## పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం

**-పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన - తక్షణ స్పందనతో రంగంలోకి దిగిన మంత్రి**

**-రెవెన్యూ-ఫారెస్ట్ మరియు ఇరిగేషన్ శాఖల సమన్వయంతో అడ్డంకుల నివారణకు ఆదేశాలు**

**-యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసిన మంత్రి.**



మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :

పెనుబల్లి మండలం లోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరిం చాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## హెచ్‌పివి టీకాను 14 నుండి 15 ఏళ్ల బాలికలు వేయించుకోవాలి

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్**



శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ మార్చి 17:

కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. అందులో భాగంగా గత నెల 28 నుండి బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా 14 నుండి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ప్రతి బాలికకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా హెచ్.పి.వి టీకాను అందజేస్తుంది. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కేంద్ర ప్రభుత్వానికి, మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలుపుతూ శేరిలింగంపల్లి బీజేపీ ఆధ్వర్యంలో కొండాపూర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై పాలభిషేకం చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలికలకు ,మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంది. బాలికలకు కూడా సుకన్య సమృద్ధి యోజన, భేటీ బచావో, భేటీ పడవో, ఉడాన్ స్కాలర్ షిప్ స్కీమ్, ఇవే కాక మహిళలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పీఎం మాతృ వందన యోజన, ముద్ర యోజన, స్టాండ్ అప్ ఇండియా నుండి లోన్లు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలియజేశారు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడేందుకు 14 నుండి 15 ఏళ్ల లోపు ఉన్న బాలికలకు ఫిబ్రవరి నుండి ఒక డోస్ కు 4000 ఖర్చు అయ్యే హెచ్ పి వి టీకాలు ఉచితంగా అందజేస్తుందని, మన తెలంగాణ లో 3,50,000 మందికి ఈ హెచ్ పి వి టీకాలు పంపిణీ చేయాలనే లక్ష్యంగా ప్రారంభించగా, మొదటి దశలో 1,45,000 వేల టీకాలు పంపిణీ చేస్తున్నారని, చాలా మందికి సరైన అవగాహన లేక చాలా తక్కువ సంఖ్యలో టీకా వేయించుకుంటున్నారని, మన శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 14 నుండి 15 ఏళ్ల లోపు ఉన్న ప్రతి బాలికకు వాళ్ళ తల్లిదండ్రులు కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందజేస్తున్న ఈ హెచ్.పి.వి టీకాను వేయించుకుని ఇలాంటి గొప్ప అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, ఆంజనేయులు సాగర్, మహేష్ యాదవ్, జితేందర్, రమేష్, గోపాల్ రావు, రామ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, గణేష్ ముదిరాజ్,లక్ష్మణ్, రవి, విష్ణు దత్తు, పద్మ, మేరీ, విజయలక్ష్మి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సోదరులు, సోదరీమణులకు హృదయపూర్వక ఆహ్వానం

**-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
ఈ నెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు నర్మెట్టలో వ్యవసాయ,మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతు మహోత్సవం.ప్రత్యేక ఆకర్షణగా వ్యవసాయ, ఉద్యానవన మరియు పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్ ,బ్యాంకులు, ఎఫ్ పి ఓ లు, స్టార్టప్‌లు మరియు ప్రైవేట్ కంపెనీల ప్రదర్శనలు మరియు అధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక ముఖాముఖీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.22వ తేదీ సాయంత్రం 4.00 గం లకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం మరియు రైతు భరోసా నిధుల విడుదల చేస్తారు.కావున ఈ వేడుకలో ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు, మరియు రైతు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి.

# ఆటో లారీ ఢీకొని యువకుడు మృతి

**పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఆటో డ్రైవర్ సంజయ్ ఘటన స్థలంలోనే మృతి.**



**పినపాక ,మార్చి 17(మీడియా టుడే):**
పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో ,లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్రి సంజయ్ గా గుర్తించారు.లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై మృతుని మేనమామ మద్దెబోయిన జంపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం చేయాలి

**డీఆర్‌డీఓ విద్యా చందన - డ్రైన్‌లు, సోక్‌పిట్‌ల నిర్మాణ పనులకు శ్రీకారం**

**స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి17(మీడియా టుడే):**
ములకలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) విద్యా చందన అధికారులకు సూచించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా ములకలపల్లి మండలం పాతగంగారం గ్రామపంచాయతీ పరిధిలోని జగన్నాధపురం గ్రామాన్ని మంగళవారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో డ్రైన్‌లు మరియు సోక్‌పిట్‌ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి వాటి పురోగతిని సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, వర్షపు నీటి నిల్వలను నివారించడం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం ఈ పనులు ముఖ్యమని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం జగన్నాధపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్‌పీఏ కలిగిన స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. సంఘాల ఆర్థిక పరిస్థితులను సమీక్షించి రుణాల సక్రమ వినియోగం, ఆదాయ వృద్ధి మార్గాలు, ప్రభుత్వ పథకాల వినియోగంపై సభ్యులకు మార్గదర్శకాలు అందించారు.స్వయం సహాయక సంఘాలు మహిళల ఆర్థిక సాధికారతకు బలమైన వేదికలని, ప్రతి సభ్యురాలు బాధ్యతతో వ్యవహరించి సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని తెలిపారు.గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య పరిరక్షణ, మహిళల ఆర్థిక సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామప ంచాయతీ ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో**

**ఇల్లంతకుంట, బోయినపల్లి, కోనరావుపేట, వేములవాడ,గంభీరావుపేట మండలాల్లో 40 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 17 :**
ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలం వంతడుపుల, అనంతారం, రేపాక, ఓబులాపూర్, బోయినపల్లి మండలం విలాసాగర్, మల్కాపూర్, మర్లపేట, కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, వేములవాడ, గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇల్లంతకుంట మండలం వంతడుపులలో మంగళవారం కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు వస్తాయని తెలిపారు. ఆయిల్ పామ్ లో అంతర పంటలుగా కూరగాయలు, మొక్క జొన్న, పూల మొక్కలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, ఇతర సబ్సిడీలు ఉన్నాయని తెలిపారు. పంటకు మంచి మద్దతు ధర వస్తుందని వివరించారు. పంట ఉత్పత్తి సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి మండలం నుంచి కొనుగోలు చేస్తారని తెలిపారు. ఒకే పంట సాగు చేయకూడదనే ఉద్దేశంతో, ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు ఇప్పటికే పీఏసీఎస్ లలో రైతులకు అవగాహన కల్పించామని, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యం నిర్దేశించామని తెలిపారు. ఆదర్శనీయమైన రైతులు ముందుకు వస్తున్నారని, మిగతా వారు కూడా సాగు చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లాకు దగ్గరలోనే సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించ నున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు

# ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేములవాడ పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతన యంత్రాల ప్రారంభం**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 17**
ప్రజల సహకారంతోనే పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవు తుందని, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ మండలం తెట్టెకుంట శివారులో వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించిన పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతనంగా సమకూర్చిన యంత్రాలను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీ నుంచి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణాల్లో చెత్త సేకరణ, చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటికే పొడి వనరుల సేకరణ కేంద్రం ఉండగా, ఇప్పుడు ఆ కేంద్రంలో ఏజెన్సీ ద్వారా నూతనంగా సమకూర్చిన యంత్రాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడానికి ఈ యంత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ వాహనాల ద్వారా ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నామని తెలిపారు. సేకరించిన పొడి చెత్తను ఈ కేంద్రానికి తీసుకువచ్చి యంత్రాల సహాయంతో ప్రాసెస్ చేసి కంపోస్ట్ తయారు చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల చెత్త నిర్వహణ సక్రమంగా జరిగి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. ప్రజలు తమ ఇళ్లలోనే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వాహనాల్లో కూడా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు కంపార్ట్‌మెంట్లలో సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్తను వేరు చేయడం వల్ల రీసైక్లింగ్ ప్రక్రియ సులభమవు తుందని, తడి చెత్త, పొడి చెత్త కలిసిపోవడం వల్ల డంపింగ్ యార్డుల్లో సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ డీఆర్‌సీసీ కేంద్రంలో ఒక బేలింగ్ మెషిన్, ఒక వెయిమెంట్ మెషిన్ ఏర్పాటు చేయగా, ఈ కేంద్రం 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. అలాగే కంపోస్ట్ కేంద్రం కూడా 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, ఎల్ల శ్రీనివాస్, తోట రాజు, కాషా శ్రీనివాస్, మూడపల్లి నీలమ్మ, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కొఠారిమిషన్ నివేదిక ప్రకారం విద్యకు30-శాతం నిధులు కేటాయించాలి

**బిఎస్పి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు**



**నేలకొండపల్లి మార్చి 17 మీడియా టుడే**
ఈ నెల 20 న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన బిఎస్పి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యారంగంలో మార్పులు తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆయన తీవ్రంగా ఆరోపించారు.గతంలో ఏడు శాతం మాత్రమే నిదులు కేటాయించిందని అవి కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదన్నారు. విద్య సమాజాభివృద్ధికి దోహదపడినా తగిన నిధులు కేటాయించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటున్న ప్రతి కార్యక్రమంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారనీ, క్షేత్రస్థాయిలో సరైన మౌలిక వసతులు లేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటే తమని ప్రశ్నించటం ప్రారంభిస్తారని తద్వారా తమ ఉనికిని కోల్పోవాల్సి వస్తుందని నాయకులు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మండలానికి కనీసం ఐదు తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారమన్నారు. రాష్ట్రంలో సుమారు 18 వేలకు పైగా టీచర్ పోస్టులు, 80 శాతానికి పైగా యూనివర్సిటీలల్లో టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ఏడాదిలో రెండు లక్షలు ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.రాష్ట్రంలో పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్స్, స్కాలర్షిప్లను విడుదల చేస్తూ పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని కోరారు.

# లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి , బి.పుష్పలత**




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 17**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ ఈ నెల 28న జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని, కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు . బి.పుష్పలత అన్నారు.మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ జిల్లా జడ్జి మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు ఎక్కువ కేసుల పరిష్కారం చేయాలని సూచించారు మరియు పోలీసు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా ఎస్పీ .డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల/ఇన్చార్జి కార్యదర్శి డీ ఎల్ ఎస్ ఎ, పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ .అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, మేజిస్ట్రేట్లు .ప్రవీణ్, సృజన, జ్యోతిర్మయి, కుమారి మేఘన, పోలీసు అధికారులు , కోర్టు మానిటరింగ్ పోలీసులు పాల్గొన్నారు.

## మాధకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

**డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి17 :**
మాధకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమిష్టి కృషితో డ్రగ్స్ రహిత కరీంనగర్ గా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాన్షియస్ నెస్ క్లబ్బులు చురుగ్గా పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ అధికారులను కూడా డ్రగ్స్ నివారణ కార్యక్రమాల్లో, సమావేశాలు భాగస్వాములను తెలిపారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలను డ్రగ్స్ నిర్మూలన ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అందుకు తగిన రీతిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోని యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు వివిధ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని అన్నారు. ప్రజా రవాణా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ డ్రగ్స్ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిషేధిత ఇంజక్షన్లు, టాబ్లెట్లు వినియోగించినా, సరఫరా చేసిన బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో గత రెండు నెలల్లో డ్రగ్ సంబంధిత కేసులు 3 నమోదు కాగా ఆరుగురిని అరెస్టు చేశారు. 578 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, నెంబర్లు రాజేంద్రప్రసాద్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా దావతే ఇఫ్తార్ కార్యక్రమం

**-ముస్లిం సోదరులకు పోలీస్ శాఖ తరుపున రంజాన్ శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్**



**నల్లగొండ, మార్చి 17 (మీడియా టుడే):**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నల్లగొండ పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా దావతే ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి అధికారులు ఇఫ్తార్ విందులో పాల్గొని సౌహార్ద వాతావరణాన్ని చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ ఆమెర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, పట్టణ ప్రముఖులు, ముస్లిం మత గురువులు, ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. యువత తప్పుదారులు పడకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ గారు మాట్లాడుతూ రంజాన్ పండుగ మనుషుల మధ్య ప్రేమ, ఐక్యతను పెంపొందించే పవిత్ర సందర్భంగా అభివర్ణించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవారికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం మత గురువులు ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమం స్నేహభావ వాతావరణంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ కె శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐలు, ఆర్.ఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



**మీడియా టుడే మధిర:**
తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధానంలో శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం దేవాలయంలో ఈనెల 19 నుంచి 28 తారీకు వరకు శ్రీ వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కమిషనర్ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి ఎం హనుమంతరావు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులు (దేవదాయ శాఖ) గోవింద హరి కి ఆలయ అర్చకులు మంగళవారం ఆహ్వానం పత్రిక ,స్వామి వారి శేష వస్త్రములు ప్రసాదములు అందజేసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ్ దేవశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ, వంశి తదితరులు పాల్గొన్నారు

# గ్యాస్ పంపిణీలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు, మర్చి17(మీడియా టుడే):**
జిల్లా అదనపు కలెక్టర్,జిల్లా పౌరసరఫరాల అధికారి డి. వేణుగోపాల్ మంగళవారం సుజాతనగర్‌లోని ఎంఎస్ సూర్య గ్యాస్ ఏజెన్సీ గోదాం, కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గోదాంలో ఉన్న ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బుకింగ్,పంపిణీ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. వినియోగదారులకు ఎల్పీజీ రీఫిల్ సిలిండర్లను సీనియారిటీ క్రమంలో పారదర్శకంగా అందజేయాలని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.గ్యాస్ సరఫరాలో ఆలస్యం, అక్రమాలు, ఫిర్యాదులు చోటుచేసు కోకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచిం చారు.ఈ తనిఖీలో సంబంధిత విభాగాల అధికా రులు, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామ సమాఖ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో భవన నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే :మార్చి 17**
గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. కావలసిన కార్మికులు, సామగ్రి సిద్ధం చేసుకోవాలని, భవన నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. మండలంలో మంజూరు అయిన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణాలు సైతం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో భాగంగా ఇండ్ల గణనకు చేస్తున్న ప్రక్రియపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు .కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

**కలెక్టర్ అంకిత్ - శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం**

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు.భద్రత, వైద్య, రవాణా, విద్యుత్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి**

**భద్రాచలం,మార్చి 17(మీడియా టుడే):**
శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణం, పట్టాభిషేకం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ పి.ఓ రాహుల్, శిక్షణా కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయాన్ని అందంగా అలంకరించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రధాన రహదారులు మరియు ఆలయ మార్గాలను శుభ్రపరిచి భక్తుల రాకపోకలకు సౌకర్యంగా ఉంచాలని ఆదేశించారు. భక్తులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని, హోటళ్లు మరియు అన్నదాన కేంద్రాల్లో ఆహార నాణ్యతపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.వైద్య శాఖ అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దర్శన లైన్ల వద్ద ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం అదనపు అంబులెన్సులు, అవసరమైన రక్త నిల్వలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక రూపొందించాలని, ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి




అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు అవసరమైన జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, ఫైర్ శాఖ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూఉత్సవాల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, తలంబ్రాల సమయంలో భక్తుల రద్దీని నియంత్రించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతల దృష్ట్యా మద్యం దుకాణాలను మూసివేయాలని తెలిపారు.అనంతరం కలెక్టర్ మిథిలాస్ స్టేడియంలో ఉత్సవాల ఏర్పాట్లను మరియు మాడవీధులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం




**జగిత్యాల మీడియా టుడే- మార్చ్ 17 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల" ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకము దాని ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య మండలి అసిస్టెంట్ సైంటిస్ట్ మహేష్ కుమార్ హాజరై ప్లాస్టిక్ వాడకం ద్వారా సంభవించే పరిణామాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం ఉంటుందని, సాధ్యమైనంతవరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్కు వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే సామూహికంగా ప్లాస్టిక్ నిషేధ ప్రతిజ్ఞను నిర్వహించినారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ ,అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రేవంతన్నా కా సహారా మిస్కీన్‌కు లబ్దిదారుల ఎంపిక



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్ . మీడియా టుడే : మార్చి 17**
తెలంగాణ మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం పొందుపరచిన "రేవంతన్నా కా సహారా -- మిస్కీన్‌ల కోసం" పథకం కోసం లబ్దిదారుల ఎంపిక ను మంగళవారం నిర్వహిం చారు. జిల్లాలోని ఫఖీర్/దూదేకుల/దూదేకుల ముస్లిం కమ్యూనిటీ అభ్యున్నతి, సంక్షేమం కోసం ఫఖీర్/దూదేకుల/దూదేకుల ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు మోపెడ్‌లు/ బైక్/ఈ-బైక్‌లను అందించేందుకు జిల్లాకు కేటాయించిన లక్ష్యం (5) అనుసారంగా ఐదుగురు లబ్దిదారులను జిల్లా స్క్రీనింగ్ కం సెలక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి తదితరులు ఉన్నారు.

## రామాపురం గ్రామ అభివృద్ధి లక్ష్యం

### - సర్పంచ్ వెంకట్ రెడ్డి



**నడిగూడెం మార్చి 17 (మీడియా టుడే)-:**
గ్రామంలో వార్డులలో ఉన్న సమస్యలు గుర్తించి స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని రామాపురం సర్పంచ్ నడిగూడెం మండల సర్పంచుల సమైక్య అధ్యక్షులు బూత్కూరు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు, ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నామా నరసింహారావు, ఉప సర్పంచ్ మందుల నాగార్జున, వార్డ్ మెంబర్స్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్

- ఫిర్యాదులు, కేసులు పెడింగ్ ఉంచకుండా పని చేయాలి.
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక.
- రంజాన్, ఉగాది పండుగ సందర్భంగా ప్రజలు ఉత్సవాలు కలిసిమెలిసి జరుపుకోవాలి.

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్.



**కోదాడ, మార్చి 17 (మీడియా టుడే)-:**
జిల్లాలోని పోలీస్ స్టేషన్లో తనిఖీలు భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనకి చేసినారు. తనకి లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, కమ్యూనిటీ కార్యక్రమాలు, సీసీ కెమెరాల నిర్వహణ ను పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులను, పెండింగ్ ఫైల్స్ పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డ్ నిర్వహణ, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం ట్రాఫిక్ పునరుద్ధరణ అంశాల గురించి పట్టణ పోలీసులకు, ట్రాఫిక్ పోలీసులకు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల ఫిర్యాదులపై వేగంగా స్పందించి వారికి భరోసా కల్పించాలని కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వేగంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పని చేయాలని అన్నారు. ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు భద్రత పట్ల, సైబర్ మోసాల పట్ల, సామాజిక భద్రత పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. కోదాడ పట్టణంలో ట్రాఫిక్ నిర్వహణ అవతరణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రజలకు వాహనదారులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సంబంధిత మున్సిపాలిటీ అధికారులతో కలిసి ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యాపార నిర్వహకులు రోడ్లపై వస్తువులు పెట్టి అమ్మకూడదని రోడ్లను ఆక్రమించడం వల్ల వచ్చి పోయే వాహనాలకు సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. రంజాన్ దసరా పర్వదినాలు ఒకేసారి వస్తున్నందున ప్రజలు ఒకరికొకరు సోదరా భావంతో ఉంటూ మతాలకతీతంగా ఉత్సవాలను కలిసి మెలిసి జరుపుకోవాలని కోరారు. ప్రజల భద్రతలో పోలీస్ శాఖ అనునిత్యం కృషి చేస్తుంది అన్నారు.ఎస్పీ వెంట కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివ శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ఐ లు సుదీర్, చిన్న మాల్సూర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజి రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ జిల్లా స్టాప్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 17**
మొక్కజొన్న కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకార శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు తో మాట్లాడి రైతులు పండించిన మొక్కజొన్న అమ్మకానికి ఇబ్బంది కలగకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి కనీస మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేయాలని కోరగా వెంటనే స్పందించిన సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు అనుమతివ్వగా హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మరియు మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మీలు, బొలిశెట్టి శివయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, మార్ఫ్ ఫెడ్ అధికారులతో కలిసి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు ప్రారంభించారని అదేవిధంగా రైతులకు ఇబ్బంది కలుగకుండా జిల్లా వ్యాప్తంగా మరియు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే పూర్తిస్థాయిలో మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందరాదని ఆ ప్రకటనలో రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ తెలిపారు

# ప్రచార ఆర్భాటం రోగులకు కష్టకాలం

### మేళ్ళచెరువులో వైద్య అధికారుల నిర్లక్ష్యం

**( సూర్యాపేట జిల్లా )// హుజూర్ నగర్ : మీడియా టుడే మార్చి 17 :**
ప్రభుత్వ వైద్య అధికారుల తీరుపై మేళ్ళచెరువు మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "అన్ని రకాల వైద్య పరీక్షలు ఒకే చోట.. మంగళవారం మెడికల్ క్యాంప్" అంటూ వాట్సాప్ గ్రూపుల్లో, ఆటో కాన్వాసింగ్ ద్వారా ఊదరగొట్టిన ప్రచారం క్షేత్రస్థాయిలో తుస్సుమంది.

**సమయం దాటినా జాడ లేని డాక్టర్లు..!**
ప్రజా పాలనలో భాగంగా మేళ్లచెరువు ప్రభుత్వ హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం ఒక విధంగా చెప్పాలంటే రోగులను నిరుత్సాహపరిచిందనే చెప్పాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, పంపిణీ చేసిన కరపత్రాల్లో ఉదయం 8:45 గంటలకే క్యాంప్ ప్రారంభమవుతుందని స్పష్టంగా పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి రోగులు ఆశతో తెల్లవారుజామునే తరలివచ్చారు. అయితే, ఉదయం 11:00 గంటలైనా ఏ ఒక్క ప్రభుత్వ వైద్య అధికారి కూడా అక్కడ అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**ఎండలో రోగుల విలవిల..!**
ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో, దూర ప్రాంతాల నుండి వచ్చిన వృద్ధులు, చిన్న పిల్లలు మరియు రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 11 గంటలకు శిబిరాన్ని ప్రారంభించిన అధికారులు కలెక్టర్ సందర్శన అనంతరం 12. 30 గంటల కు భోజన విరామం అనే వంకతో వెళ్లిన డాక్టర్లు మరలా క్యాంపుకు తిరిగి రాలేదు అని అక్కడికి వచ్చిన రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గంటల తరబడి వేచి చూసినా డాక్టర్ల ఆచూకీ లేకపోవడంతో రోగులు తమ నిరసనను వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించనప్పుడు ఈ హంగులు, ఆర్భాటపు ప్రచారాలు ఎందుకు?" అని స్థానికులు అధికా రులను సూటిగా ప్రశ్నిస్తున్నార .పెద్ద ఎత్తున ప్రచారం చేసి, తీరా సమయానికి విధులకు హాజరుకాకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. ఎండలో రోగులను ఇబ్బంది పెట్టిన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# బరిలో కత్తి తగిలి పందెం కోడికి తెగిపోయిన భుజం ఎముక

### ఆర్థోపెడిక్ సర్జరీ ద్వారా ఎముకకి రాడ్ వేసి అతికించిన అసిస్టెంట్ డైరెక్టర్



**కోదాడ, మార్చి 17 (మీడియా టుడే)-:**
మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన పందెం కోడి యజమాని మొన్న తన కోడి పుంజును బరిలో దింపగా అవతలి కోడిపుంజు విసిరిన కత్తి దెబ్బకి కోడి పుంజు భుజం ఎముక ( రెక్క ఎముక) తెగి రెండుగా విడిపోయింది . అసలే కోళ్ళంటే పిచ్చి, అందులోనూ పౌరుషాలకు ప్రతిరూపమైన పందెం కోడి అంటే మహాపిచ్చి. విరిగిన రెక్కను ఎలాగైనా కాపాడుకోవాలనే తపనతో వైద్యంకోసం నిన్న మేళ్లచెర్వు వెళ్లగా కోడిపుంజును కోదాడ తీసుకువెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించడం తో , కోసుకొని తినే కోడే కదా అన్న చిన్న చూపు లేకుండా తనకు నచ్చిన ప్రాణానికి ఎలాగైనా తిరిగి రెక్కను అందించాలనే పెద్ద మనస్సుతో యజమాని ఈరోజు కోడిపుంజుని కోదాడ పట్టణం ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకు వచ్చారు. రెక్క విరిగిన కోడి పుంజును పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య, బొక్క విరిగి రెండు రోజులు కావడం తో తెగిన కండ, బొక్కలు ఇన్ఫెక్షన్ సోకి ఉండగా , గాయాలను శుభ్రపరచి రక్త ప్రసరణ జరిగేలా కొత్త పందును తయారు చేసి ఆర్థోపెడిక్ సర్జరీ ద్వారా విరిగిన ఎముకలను రాడ్ వేసి అతికించి, గాయాన్ని కుట్లతో మూసి వేసి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తిచేశారు. అనంతరం అంతవరకూ రెక్క వేలాడేసి తిరిగిన కోడి రాడ్ వేశాక రెక్కను ఆడిస్తూ నిటారుగా లేచి తిరగడం తో యజమాని సంతోషం వ్యక్తం చేస్తూ ఉదయం దవాఖానకి వస్తే ఉదయం నుండి నందిగామ, గడ్డిపల్లి, మునగాల, హుజూరాబాద్ నగర్ తదితర ప్రాంతాల నుండి వచ్చిన జంతువులకు ఆపరేషన్స్ పూర్తి అయ్యేసరికి మధ్యాహ్నం నాలుగున్నరకి కానీ నావంతు రాలేదని, దూడకి పొట్టలో కణితి, కుక్కకి గర్భాశయ కాన్సర్ కణితి కుక్కలో చెవి ఇన్ఫెక్షన్ తదితర ఆపరేషన్లు వరుసగా చేసి కూడా నా కోడికి ఆపరేషన్ చేయడం చూశాక నేను ఉదయం నుండి నా వంతుకోసం ఎదురు చూసిన అలసట అంతా మర్చిపోయానని అన్నారు యజమాని. చికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


### వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలు, ఉద్యోగులకు సన్మానం






**రాజన్న సిరిసిల్ల, మార్చి -17**
మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళలు, ఉద్యోగులను సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లా డుతూ.. మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పోషకా హారం తీసుకోవాలని, వ్యాయామం, యోగా చేయాలని తెలిపారు. ప్రతి మహిళా కనీసం 20 మంది మహిళలకు మద్దతుగా నిలవాలని ఆకాం క్షించారు. తాము విధులు నిర్వర్తించే చోట, తమ పరిసర ప్రాంతాల వారికి ఆపద సమయములో భరోసా ఇవ్వాలని సూచించారు. మహిళలు డబ్బును పొదుపు చేయాలని వివరించారు. మహిళల ఆర్థిక అభివృద్ధితో తన కుటుం బం, దేశ వృద్ధి సాధ్యమని తెలిపారు.కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధ భాయ్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు భాగ్య, డీఆర్డీఓ గీత, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మత్స్య శాఖ అధికారి సౌజన్య, వైద్యాధికారి రజిత, మైనార్టీ సంక్షేమ అధికారి భారతి, ఎస్సీ సంక్షేమశాఖఅధికారి స్వప్న, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అబ్బాపూర్ గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం




గొల్లపల్లి మీడియా టుడే– మార్చ్ 17

గొల్లపల్లి మండలంచిల్వకోడూర్ సెక్షన్ పరిధిలోని అబ్బాపూర్ గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్య క్రమం లో ఓవర్ లోడ్ ఉన్న డి టీ ర్ పై అదనంగా నూతన 63 కె వి ఏ అమర్చి ప్రారంభించారు.అలాగే ఇండ్ల మీదుగా ఉన్న లైన్ ను మార్చి వేయడం జరిగింది. ఇండ్ల పైన ఉండే లైన్ మార్చే పనులకు గాను 2 లక్షలు మరియు నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు 4 లక్షలు అంచనా వ్యయాలు కాగా గౌరవ ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహకారం అందించారు. అదనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో ఇటు రైతులకు మరియు ఎన్నో ఏండ్ల నుండి ఉన్న సమస్య ,ఇండ్ల పై వైర్లను తొలగించినందుకు వినియోగ దారులు హర్షం వ్యక్తం చేశారు.ఇట్టి పనులకు పూర్తి కావడానికి కృషి చేసిన విద్యుత్ శాఖ వారికి గ్రామ ప్రజలు మరియు పాలక వర్గం ధన్యవాదాలు తెలిపారు.ఇట్టి కార్య క్రమం లో ఏఈ రాకేష్ కుమార్, సబ్ ఇంజనీర్ మహేష్, గ్రామ సర్పంచ్ చిట్యాల సౌందర్య ,ఉప సర్పంచ్ చెవుల తిరుపతి, రమేష్, శ్రీకాంత్ మరియు గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు

## తంగళ్ళపల్లిలో : 255 మందికి ఉచిత వైద్య పరీక్షలు

### డాక్టర్ , ఎం . రజిత



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 17**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం తంగళ్ళపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణులతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం . రజిత సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారి డాక్టర్ రజిత మాట్లాడుతూ, శిబిరానికి వచ్చిన సుమారు 255 మంది రోగులకు వివిధ విభాగాల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా నేత్ర సంబంధిత, దంత వైద్యం, గైనకాలజీ (స్త్రీల వైద్యం), మరియు పిల్లల వైద్య నిపుణులు రోగులను క్షుణ్ణంగా పరీక్షించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ ప్రత్యేక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్నేహ , ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు

### కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి

**కోదాడ, మార్చి 16 (మీడియా టుడే)–:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోదాడ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం కోదాడ పట్టణం మసీదు సెంటర్ వద్ద ట్రాఫిక్ నియమాల పట్ల రోడ్డు ప్రమాద నివారణ పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని కోరారు పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల జాగ్రత్తగా వాహనం నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇతరులను ప్రమాదాల బారిన పడేస్తున్నారని అన్నారు. వాహనాలకు అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలని ప్రయాణ సమయంలో చుట్టు పరిసరాలు గమనిస్తూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాహనాలు నడపాలని కోరారు.

## ఘోర రోడ్డు ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు

**(హుజుర్ నగర్ )//మేళ్ళచెర్వు :మీడియా టుడే మార్చి 17:**



సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మేళ్లచెరువు నుంచి హుజూర్నగర్ వెళ్లే దారిలో గంగా నగర్ కాలనీ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. హుజూర్నగర్ నుంచి మేళ్లచెరువు వైపు టీవీఎస్ పై వస్తున్న వ్యక్తిని మహా సిమెంట్ కంపెనీకి సంబంధించిన ఒక లారీ ఢీకొనడంతో వ్యక్తికి కాలు పూర్తిగా విరిగిపోయినట్టు స్థానికుల సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ . మీడియా టుడే: మార్చి 17**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్పూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఇండ్లను పూర్తి చేయించాలని ఆదేశించారు. జిల్లాలో గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్ర భవనాల పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని భవనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వసతులు కల్పించిన తర్వాత ప్రారంభించాలని స్పష్టం చేశారు.సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కన్నాయిగూడెంలో సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

**కన్నాయిగూడెం,మార్చి17**

:ములుగు జిల్లా కలెక్టర్ వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలను జారీ చేస్తే కన్నాయిగూడెం మండల కేంద్రంలో పిహెచ్ సీ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం విమర్శలకు దారితీస్తోంది ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నిర్దిష్ట సమయానికి హాజరు కాకపోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.వైద్య పరీక్షలు చేయించుకోవాడానికి వచ్చిన పేషెంట్స్ ఎంత ఎదురు చూసిన ల్యాబ్ టెక్నీషియన్ రాకపోవడంతో పేషెంట్స్ తీరిగి ఇంటికి వెళ్లి పోయారు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషన్ ఉదయం హాజరు వేసుకొని మధ్యాహ్నం 12ముందే వెళ్లారని రోగులు ఆరోపించారు ప్రత్యేకించి వృద్ధులు,గర్భిణీలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వైద్య సేవల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, స్థానిక స్థాయిలో అమలు లోపం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, సమయపాలనపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రముఖ ప్రజా వైద్యుడు వేము గంగరాజును ఘనంగా సన్మానించిన లింగాల



**నేలకొండపల్లి మార్చి 17 మీడియా టుడే**

ఖమ్మం పట్టణంలోప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు మంచి వైద్యం చేస్తూ ప్రజల మన్ననలు పొందిన ప్రజా వైద్యుడు డాక్టర్ వేము గంగరాజును.మంగళవారంబి.ఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జడ్పీ సెంటర్ లోని డాక్టర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయానికి డాక్టర్ గంగరాజు వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని. లింగాల అరుణ్ కుమార్. మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకుడు గుంతేటి వీరభద్రం. కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి దానియేలు.తదితరులు ఘనంగా సన్మానించారు. సందర్భంగా డాక్టర్ గంగరాజు మాట్లాడుతూ. వైద్యుడిగా నా వంతు సహకారం నేను ప్రజలకు అందిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. గుంతేటి వీరభద్రం మాట్లాడుతూ పట్టణంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని ఆయన కొనియాడారు. ఖమ్మం పట్టణంలో మీకు ప్రజా వైద్యుడిగా మంచి పేరు ఉందని వీరభద్రం చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ ఇంకా మంచి పేరుసంపాదించుకోవాలని ఆయన కోరారు.

# శాతవాహన ఉర్దూ సహాయ ఆచార్యునికి పేటెంట్

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 17 :**

శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ఉర్దూ సహాయ ఆచార్యులు డా.నజిముద్దీన్ మునవర్ కి పేటెంట్ లభించింది. "వెర్నాక్యూలర్ లాంగ్వేజ్ ట్రాన్సలేషన్ డివైస్" అనే అంశంపై పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, డా.మునవర్ను అభినందిస్తూ, ఇతర అధ్యాపకులు కూడా మరిన్ని పరిశోధనలు చేయాలని విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అభినందనలు తెలియజేశారు. డాక్టర్ నజిముద్దీన్ మునవర్ ఉర్దూ విభాగంలో సహాయ ఆచార్యులుగావిధులు నిర్వహిస్తున్నారు. ఆయన పలు పుస్తకాలతో పాటు, అంతర్జాతీయ సెమినార్లలో, జర్నల్స్ లో తన పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఆయన బోర్డు అఫ్ స్టడీస్ ఉర్దూ చైర్మన్గా, చీఫ్ వార్డెన్ గా, స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ గా పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు వి సి డా. హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి



, ఉర్దూ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ అబ్రారుల్ బాక్వి, డా. జాఫర్, డా. హుమెరా ఇతర ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డా. నజిముద్దీన్ మునవర్ నుఅభినందించారు.

# మత సామరస్యానికి ప్రతీక

**రాయికల్–మీడియా టుడే–మార్చి 17:**

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆద్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు... ఇఫ్తార్ విందు హిందూ ముస్లిం ఆత్మీయత, మతసామరస్యానికి, ఐక్యత, పరస్పర గౌరవం, దాన గుణానికి ప్రతీక అని అన్నారు. అనంతరం మైనార్టీ నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, తహశీల్దార్ నాగార్జున, ఎంపిడిఓ చిరంజీవి,మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్, భూక్య రాకేష్, నాయకులు శ్రీదర్ రెడ్డి, మోర హనుమండ్లు, కాటిపెల్లి గంగా రెడ్డి, మచ్చ శేఖర్, అనిల్, నాగరాజు, రవీందర్ రెడ్డి, కోల శ్రీనివాస్, రవీందర్ రావు, ఏనుగు మల్లారెడ్డి, గన్నె రాజిరెడ్డి, ఇంతియాజ్, బెజ్జంకి మోహన్, అచ్యుత రావు తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి వేదిక



**రాయికల్-మీడియా టుడే-మార్చి 17:**
భూ సమస్యల పరిష్కారానికి రిసర్వే వేదిక అని అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత అన్నారు. రాయికల్ మండలం ధావనపల్లి గ్రామంలో మంగళవారం భూభారతి 2025-భూ సర్వేలో భాగంగా...రీ సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి కొత్త భూ సమస్యలు లేకుండా...పాత సమస్యలకు ముగింపు పలికెల రైతులు రిసర్వేలో భాగస్వాములు కావలని సూచించారు. సర్వే అనంతరం భూదార్ కార్డులు జారీ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ నాగార్జున, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కిషన్ ప్రసాద్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే విఠల్రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, మండల సర్వే అధికారి నరేందర్, సర్పంచ్ ప్రసాద్, కార్యదర్శి, జిపిఓలు లావణ్య, స్వప్న, లైసెన్సు సర్వేయర్లు ప్రభాస్, వంశీ, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు



**రాయికల్-మీడియా టుడే-మార్చి 17:**
రాయికల్ పట్టణంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పోలీస్ స్టేషన్ లో, 12వ వార్డు, 2వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఊడ్చుట, డ్రైనేజీ పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, ఎస్సై సుధీర్ రావు, కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## శాతవాహన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ఫలితాల విడుదల



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 17 :**
శాతవాహన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ప్రవేశ ఫలితాలను ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ పరిపాలనా భవనంలో విడుదల చేస్తూ విశ్వవిద్యాలయాన్ని పరిశోదనలో కూడా ముందుకు తీసుకువెళ్తామని, అత్యుత్తమ పరిశోదనలు, పేటెంట్స్ తో విద్యారంగంలో మేలైన విశ్వవిద్యాలయంగా నిలుపుతామని పేర్కొన్నారు. ఫాకల్టీ అఫ్ ఆర్ట్స్ తెలుగు, ఉర్దూ, అర్ధశాస్త్రం, సామాజిక శాస్త్రంలో, సైన్స్ లో వృక్షశాస్త్ర, రసాయన శాస్త్ర,భౌతిక శాస్త్రఅంలో ఫాకల్టీ అఫ్ కామర్స్ వాణిజ్య శాస్త్ర విభాగంలో ఫలితాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్డి డా. హరికాంత్, డా. శరసీజ, డా. తిరుపతి పాల్గొన్నారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్సైట్లో చూడవలసిందిగా శాతవాహన విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ సంచాలకులు డా.మహమ్మద్ జాఫర్ తెలిపారు.

## పరిశుభ్ర పట్టణం దిశగా మున్సిపాలిటీ కమిషనర్ చర్యలు

**మందమర్రి మార్చి 17**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణ పరిశుభ్రతకు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ పనులు చేపట్టారు. మందమర్రి రామన్ కాలనీ ఫ్లైఓవర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలలో మంగళవారం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజలింగు పర్యవేక్షణలో ఏరియా వ్యాప్తంగా పేరుకుపోయిన దుమ్ము దూళి చెత్తను తొలగించారు.

# ధర్మారంలో ప్రకృతి సేద్యంపై అవగాహన

### రైతులకు కిట్లు, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ





**జగిత్యాల రూరల్, మార్చి 17:**
మీడియా టుడే. జగిత్యాల జిల్లా సట్టా రాజశేఖర్ రిపోర్టర్జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామ రైతులకు లక్ష్మీపూర్ రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయం (చీఫ్బతీఘశ్రీ ఖీఘతీఎఱఅస్త్ర) పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు ప్రకృతి సేద్యం పట్ల ఉన్న ప్రాముఖ్యతను, అవలంబించాల్సిన మెళకువలను క్షుణ్ణంగా వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధంగా లభించే వనరులతో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చు తగ్గడమే కాకుండా, భూసారం పెరుగుతుందని మరియు ప్రజలకు పోషక విలువలున్న ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు ఫార్మర్ కిట్స్ మరియు భూసార పరీక్షల ఫలితాలతో కూడిన సాయిల్ హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ తిరుపతి నాయక్, ఏఈఓ హరీష్, గ్రామ సర్పంచ్ పరమల సుమలత మల్లేష్ గారు ఉప సర్పంచ్ దీకొండ ప్రేమ్ గారు నాథ్, సీఆర్పీలు నేరెళ్ల సతీష్ మేఘన, పత్తిపాక తిరుపతి. శిరీష యాగంలో తిరుపతి పరమాల రాజేష్ రేణు మల్లేశం బొమ్మని మల్లయ్య. గిద్దె బక్కయ్య వడ్డే ముత్తన్న. బెడద నరేష్ గోస్కుల రవి గోస్కుల రాజన్న. ధర్మారం గ్రామ ప్రజలు. రైతులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఏడి తిరుపతి నాయక్ ాజూ హరీష్ సార్ గారు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మీడియా మిత్రులు. సట్టా రాజశేఖర్ నక్క సతీష్ కోరేపు రాజకుమార్. హరీష్సారుధన్యవాదాలుతెలియజేశారు మీడియా టుడే సట్టా రాజశేఖర్ జగిత్యాల జిల్లా





# సింగరేణి సంస్థను రక్షించుకోవాలి

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### జిఎం చర్చల స్థాయి ప్రతినిధి సివి రమణ - కార్యదర్శి సృజనా గీతిక



**మందమర్రి మార్చి 17**
సింగరేణి సంస్థను కాపాడుకుంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మందమర్రి ఏరియా జిఎం కార్యాలయంలో మంగళవారం ఏఐటియుసి యూనియన్ పిలుపుమేరకు సేవ్ సింగరేణి సంస్థ భవిష్యత్తు కార్మికుల సమస్యల పరిష్కారం లాంటి డిమాండ్లతో జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు జిఎం చర్చల స్థాయి ప్రతినిధి సివి రమణ, కార్యదర్శి సృజనా గీతిక లు నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంస్థ చొరవ చూపాలని, సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. మెడికల్ బోర్డు పునరుద్ధరణ పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు ఏరియా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సృజన గీతిక, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొమ్మ శ్రీనివాస్, పిట్ కమిటీ సభ్యులు బింగి సత్యనారాయణ, లక్ష్మణ్, జలది, జ్యోతి, తాజుద్దీన్, సుమలత మరియు జీఎం ఆఫీస్ సిబ్బంది శ్వేత, హిమబిందు, మాధవి, నవీన, స్రవంతి,శిరీష,లావణ్య, స్వాతి, జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ ఇంజనీర్ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

### పేర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలి - మెడికల్ బోర్డు పునరుద్ధరించాలి

### ఏరియా పిట్ కార్యదర్శి కలువల శ్రీనివాస్




**మందమర్రి మార్చి 17**
మెడికల్ బోర్డును పునరుద్ధరిస్తూ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి ఏరియా పిట్ కార్యదర్శి కలువల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మందమరి ఏరియా సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అందించాలని, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ సహాయ కార్యదర్శి చెట్టి రాజేందర్, గౌరవ ఉపాధ్యక్షులు మర్రి వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు బాలాజీ రవీందర్, బండి సదానందం, సమియుద్దీన్, యువ నాయకులు మెంగని శివరాజ్, దుర్గం శంకర్, రావుల శ్రీనివాస్, మహిళా కార్మికులు దేవేంద్రమ్మ, కాంట్రాక్ట్ కార్మికులు ఇమామ్, సాగర్ , సందీప్, శ్రీనివాసరెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మీడియా టుడే

బుధవారం, మార్చి 18, 2026



# పిల్లల కోసం సినిమా సంస్థ

తల్లిగా మారాక, పిల్లల గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నది బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ అలియాభట్. నటిగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తూ, నిర్మాతగా ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్ అనే సంస్థను స్థాపించి, డార్లింగ్స్, జిగ్రా వంటి విభిన్న కథా చిత్రాలను నిర్మించి విమర్శకుల ప్రశంసలందుకున్నది అలియాభట్. తాజాగా తన 33వ పుట్టినరోజును పురస్కరించుకొని, కేవలం పిల్లల కోసం 'ఎటర్నల్ కిడ్స్' పేరిట మరో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించింది ఈ అందాలభామ. ఈ సంస్థ గురించి అలియా మాట్లాడుతూ 'ఇది నా ఎటర్నల్ సన్‌షైన్ సంస్థకు బిడ్డలాంటిది. పిల్లల కోసం అద్భుతమైన కథలను అందించడమే ఈ సంస్థ లక్ష్యం. నా చిన్నప్పుడు విన్న కథల్నీ, నన్ను పెంచిన కథల్నీ ఈ సంస్థ ద్వారా సజీవం చేయబోతున్నా. త్వరలోనే ఈ సంస్థపై మూడు సినిమాలు పట్టాలెక్కనున్నాయి' అంటూ చెప్పకొచ్చింది అలియాభట్.

# మరో మెగా ప్రాజెక్ట్ ప్లాన్ చేసిన హరీష్ శంకర్..

## ఈ సారి ఎవరితోనో తెలిస్తే ఆశ్చర్యపోతారు..!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో దర్శకుడు హరీష్ శంకర్ ప్రమోషన్ కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలు పంచుకుంటున్న ఆయన, తాజాగా మెగాస్టార్ చిరంజీవి గురించి చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా గురించి మాట్లాడిన హరీష్ శంకర్, 'ఉస్తాద్ భగత్ సింగ్' పవన్ కల్యాణ్ అభిమానులకు నిజమైన మాస్ జాతరలా ఉంటుందని తెలిపారు. 'గబ్బర్ సింగ్' తర్వాత మరోసారి పవన్‌ను పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో చూపిస్తున్నామని, డైలాగులు మరియు యాక్షన్ సన్నివేశాలు థియేటర్లలో అభిమానులతో ఈలలు వేయించేలా ఉంటాయని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, హరీష్ వ్యాఖ్యలు సినిమాపై హైప్‌ను మరింత పెంచాయి. ఇక సినిమా ట్రైలర్ చూసిన తర్వాత మెగాస్టార్ చిరంజీవి తనకు ఫోన్ చేసి దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడినట్లు హరీష్ శంకర్ వెల్లడించారు. ట్రైలర్‌లోని ప్రతి షాట్ గురించి చిరంజీవి ఎంతో ఆసక్తిగా మాట్లాడారని చెప్పారు. పవన్ కల్యాణ్ చాలా అందంగా కనిపిస్తున్నాడని, డైలాగులు కూడా అద్భుతంగా ఉన్నాయని చిరంజీవి ప్రశంసించారని తెలిపారు. ఆ సంభాషణ తర్వాత తనకు ఒక విషయం స్పష్టంగా అర్థమైందని హరీష్ అన్నారు. చిరంజీవి గారికి పవన్ కల్యాణ్ కేవలం తమ్ముడు మాత్రమే కాదు.. ఒక కొడుకు లాంటివాడు అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల్లో మరింత చర్చకు దారితీస్తున్నాయి. తన భవిష్యత్ ప్రాజెక్టుల గురించి కూడా హరీష్ శంకర్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేయడం తన చిరకాల కోరిక అని తెలిపారు. త్వరలోనే చిరంజీవితో ఒక ఫుల్ లెంగ్త్ మాస్ ఎంటర్‌టైనర్ తెరకెక్కించే ప్రయత్నంలో ఉన్నట్లు వెల్లడించారు. చిరంజీవి గారితో నేను సినిమా చేస్తే అది ఖచ్చితంగా 'రౌడీ అల్లుడు', 'గ్యాంగ్ లీడర్', 'దొంగ మొగుడు' తరహాలో వింటేజ్ మాస్ స్టైల్‌లో ఉంటుంది. అలాంటి స్థాయి సినిమా ఆయనకు ఇవ్వడమే నా లక్ష్యం అని హరీష్ శంకర్ చెప్పారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మరోవైపు హరీష్ శంకర్ కూడా 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలతో పాటు మరికొన్ని ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ ఎప్పుడు అధికారికంగా పట్టాలెక్కుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

# ఆ దర్శకుడికి ఓకే చెప్పాడా?



ఏపీలో ఎన్నికల హడావిడి ముగియగానే, ముందు ఒప్పుకున్న సినిమాలన్నీ చకచకా పూర్తి చేశారు పవన్‌కల్యాణ్. ఓ స్టార్ హీరో ఎనిమిది నెలల్లో మూడు సినిమాలు విడుదల చేయడమంటే ఈ రోజుల్లో సామాన్యమైన విషయం కాదు. త్వరలో ఆయన సురేందర్‌రెడ్డి సినిమాను పట్టాలెక్కించనున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి ఇచ్చినట్టే ఈ సినిమాక్కూడా కాల్‌షీట్స్ 45 రోజులే ఇచ్చారట పవర్‌స్టార్. ఇకనుంచి ఏడాదికి రెండు సినిమాలు విడుదల చేయాలనేది పవన్‌కల్యాణ్ నిర్ణయం. అందులో భాగంగా సురేందర్‌రెడ్డి సినిమాతో పాటు మరో ప్రాజెక్టుకు కూడా లైన్‌లో పెట్టేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి పవన్‌కల్యాణ్ ఓ సినిమా చేయబోతున్నారు. తమిళ దర్శకుడు మోహన్‌రాజా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారట. ఇటీవలే ఆయన కథ కూడా వినిపించినట్టు టాక్. చిరంజీవి 'గాడ్‌ఫాదర్' సినిమాకు మోహన్‌రాజానే దర్శకుడు. అలాగే రామ్‌చరణ్ 'ధృవ'కు మాతృక అయిన 'తని ఒరువన్'కూ దర్శకుడు మోహన్‌రాజానే. స్టైలిష్ మేకర్ అనే పేరుతో పాటు.. సినిమాను వేగంగా పూర్తి చేస్తాడనే గుడ్‌విల్ కూడా మోహన్‌రాజాకు ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పవన్‌కల్యాణ్‌కు కావాల్సింది కూడా అదే. కాబట్టి ఈ సినిమా దాదాపు ఖరారైనట్టే. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

# ఎమోషనల్ పోస్ట్‌తో షాక్ ఇచ్చిన రీతూ చౌదరి..

సీరియల్స్, రియాలిటీ షోలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రీతూ చౌదరి మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా బిగ్ బాస్ షో తర్వాత ఆమెకు మంచి ఫేమ్ రావడంతో ప్రస్తుతం టీవీ కార్యక్రమాలు, ఈవెంట్లతో బిజీగా గడుపుతోంది. అయితే తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ ఎమోషనల్ స్టోరీ నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. గతంలో రీతూ చౌదరి శ్రీకాంత్ అనే వ్యాపారవేత్తతో ప్రేమలో ఉన్నట్టు ప్రకటించింది. అంతేకాకుండా అతడితో త్వరలో పెళ్లి కూడా చేసుకోబోతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. అయితే తర్వాత ఏమైందో తెలియదు కానీ, కొంతకాలానికి వారిద్దరూ విడిపోయారు. ఈ విషయాన్ని కూడా రీతూ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఇక బిగ్ బాస్ షో తర్వాత ఆమె డిమాన్ పవన్ తో డేటింగ్ చేస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై రీతూ ఎప్పుడూ స్పందించలేదు. అయినప్పటికీ ఇద్దరూ కలిసి తరచూ కనిపించడం, సోషల్ మీడియాలో ఫోటోలు, పోస్టులు షేర్ చేయడం వల్ల ఈ వార్తలు మరింత బలపడ్డాయి. ఇదిలా ఉంటే తాజాగా రీతూ చౌదరి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెట్టిన ఒక భావోద్వేగ పోస్ట్ వైరల్ అవుతోంది. ఆ పోస్ట్‌లో ఆమె సమాజం అమ్మాయిలను చాలా సులభంగా జడ్జ్ చేస్తుందని, కానీ వారి జీవితాల్లో ఏమి జరిగిందో తెలుసుకునే ప్రయత్నం ఎవరూ చేయరని పేర్కొంది. తాను నిజంగా ప్రేమించానని, ఆ వ్యక్తిని ఎంతో కేర్ చేసానని, నిజాయితీగా రిలేషన్‌లో ఉన్నానని చెప్పింది. కానీ చివరకు తానే బాధపడాల్సి వచ్చిందని తెలిపింది. ప్రేమ కోసం అడుగుతూ కూడా చివరికి మోసపోయానని, రిలేషన్ బ్రేక్ కావడంతో తీవ్రంగా డిప్రెషన్‌కు గురయ్యానని తన భావాలను వెల్లడించింది. అయినా కూడా కుటుంబం, కెరీర్ కోసం ముఖంపై నవ్వుతో ముందుకు సాగుతున్నానని చెప్పింది. కానీ సమాజం మాత్రం నిజం తెలుసుకోకుండా రూమర్స్, ఆరోపణలనే నమ్ముతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఒక దశలో మాట్లాడే మాటలు కూడా అలసిపోయినప్పుడు నిశ్శబ్దమే బలం అవుతుందని పేర్కొంది. అంతేకాదు, తనను హార్ట్ బ్రేక్ చేసిన వ్యక్తి మరో అమ్మాయితో ముందుకు వెళ్లిపోయాడని కూడా సూచించింది. ఒకప్పుడు ఫ్రెండ్ అని పిలిచిన అమ్మాయితోనే అతడు వెళ్లిపోయాడని చెప్పడం మరింత ఆసక్తిని రేపుతోంది. అంతేకాకుండా ఒక అమ్మాయి డబ్బు లేదా అటెన్షన్ కోసం మరో అమ్మాయిపై ఆరోపణలు చేయడం తనకు షాక్ ఇచ్చిందని కూడా పేర్కొంది. ఈ పోస్ట్‌తో సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. రీతూ చెప్పిన కథ తన జీవితానిదేనా? ఆ వ్యక్తి ఎవరు? అది గతంలో ప్రేమించిన శ్రీకాంత్ గురించేనా? లేదా ఇంకెవరైనా ఉన్నారా? అలాగే తనను నెగిటివ్‌గా చూపించిన అమ్మాయి ఎవరు? అనే ప్రశ్నలు నెట్టింట వినిపిస్తున్నాయి.



Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103